RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 104 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం,అక్టోబర్,12,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 104 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,October,12,2025 | PAGES : 8 RS : 4 /- |




### చైనాపై ట్రంప్ మరోసారి

# ‘టారిఫ్’ బాంబు

## 100 శాతం సుంకాల ప్రకటన

- చైనాపై అదనంగా 100 శాతం టారిఫ్‌లు ప్రకటించిన ట్రంప్
- అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సమావేశం రద్దు చేసుకుంటానని హెచ్చరిక
- రేర్ ఎర్త్ ఖనిజాల ఎగుమతిపై చైనా ఆంక్షలకు ప్రతిచర్య
- నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సుంకాలు
- ట్రంప్ ప్రకటనతో తీవ్రంగా పతనమైన అమెరికా స్టాక్ మార్కెట్లు
- ప్రపంచాన్ని చైనా బందీగా మార్చాలని చూస్తోందని ట్రంప్ ఆరోపణ

వాషింగ్టన్: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరోసారితీవ్రరూపం దాల్చింది. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అ మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంచల న ప్రకటన చేశారు. అంతేకాకుండా, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో జరగాల్సిన కీలక సమావేశాన్ని రద్దు చేసుకుంటానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిణామంతో ప్రపంచ మార్కెట్లలో ఒక్కసారిగా ఆం దోళన నెలకొంది.రేర్ ఎర్త్ ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడాన్ని తీవ్రంగా పరిగణించిన ట్రంప్, ప్రతీకార చర్యలకు దిగారు. చైనా చర్యలను “తీవ్రమైన దూకుడు”గా అభివర్ణించిన ఆయన, నవంబర్ 1 నుంచి కొత్త టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. కేవలం టారిఫ్‌లే కాకుండా, అమెరికా నుంచి చైనాకు ఎగుమతి చేసే “అన్ని రకాల కీలక సాఫ్ట్‌వేర్‌లపై” కూడా నియంత్రణలు విధిస్తున్నట్లు తన ‘ట్రూత్ సోషల్’ ఖాతాలో వెల్లడించారు.

హైదరాబాద్,తెలంగాణ దిశ : బీసీ రిజర్వేషన్ల పై సుప్రీంకోర్టు కి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సోమవారం సుప్రీం కోర్టును ఆశ్రయిం చనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబం ధించిన జీవో 9 పై తెలంగాణ హైకోర్టు స్టే విధించ డంతో రాష్ట్ర ప్రభు త్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు ను స్టడీ చేసిన ప్రభుత్వం.. సీనియర్ కౌన్సిల్ తో సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అభిషేక్ మను సింగ్వి తో పాటు సిద్దార్థ దవే.. రిజర్వేషన్ల పై ప్రావీణ్యం కలిగిన అడ్వకేట్ లతో వాదనలు వినిపించా లని నిర్ణయించిన ట్లు సమాచారం. హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక సం స్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది.ఈ మేరకు సీ ఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింగ్వి తదితరులు జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. హైకోర్టు స్థానిక సంస్థలు ఎన్నికల నోటిఫికేషన్, జీవో 9 మీద స్టే ఇవ్వడంపై తదుపరి చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. జీవో9 ని అమలు చేసేందుకు సుప్రీం కోర్ట్ తలుపు తట్టాలని నిర్ణయానికి వచ్చారు...



### హైకోర్టు స్టేతో సుప్రీంలో

# సవాల్

## 42శాతం బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్



### దగ్గుమందుపై తమిళనాడు సర్కార్

# నిర్లక్ష్యం

## తగు చర్యలు తీసుకోక పోవడంతోనే సిరప్ మరణాలు కేంద్ర ప్రభుత్వవర్గాల గుర్తింపు

న్యూఢిల్లీ,అక్టోబర్11:రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దగ్గుమం దు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాల ంలో చర్యలు తీసుకోక పోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని పేర్కొన్నాయి.



# సిఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

### కృష్ణా, గోదావరి నీళ్లు దోస్తున్నా ఉలుకేదీ - బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెటకారం

హైదరాబాద్, తెలంగాణ దిశ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు.. నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు.కింది నుంచి గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే..పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, శివకుమార్ దగ్గర మాట్లాడుతాడనుకున్నా.వాళ్ళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అయినా రేవంత్ రెడ్డి మాట్లాడలేదు.ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుద్దని కనీసం బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ఫోన్ కూడా చేపించలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పని కాదు.. తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీష్ రావు సూచించారు.



### తెలంగాణ ఐకానిక్‌గా

# టీ స్క్వేర్ నిర్మాణం

**నవంబర్ నెలాఖరుకల్లా పనులు చేపట్టాలి అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**

హైదరాబాద్, తెలంగాణ దిశ : టీ స్క్వేర్ నిర్మాణం తెలంగాణ ఐకానిక్‌గా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ హబ్, టీస్క్వేర్ ప్రాజెక్టులపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, టీజీఐఐసీ సంయుక్తంగా ఈ రెండు ప్రాజెక్టులు చేపడుతున్నాయి. రాయ దుర్గం సమీపంలో చేపట్టనున్న టీస్క్వేర్ నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరుకు ప్రారంభించాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. టీస్క్వేర్‌లో ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థల ఔట్‌లెట్లు ఉండాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ..



### భారత్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే

# అలా కూడా చేయండి

## నరేంద్ర మోదీ పిలుపు

ఢిల్లీ : భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే వరి, గోధుమ పంటలతోపాటు ప్రొటీన్ అధికం గా లభించే పప్పుల సాగును మరింత పెంచాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఆయన పీఎం ధన్ ధాన్య కృషి యోజన, మిషన్ ఫర్ ఆత్మనిర్భరత కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడు తూ, దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయడంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన దేశంలో పండించాలని ఆయన పిలుపునిచ్చారు.దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.




### వరంగల్, నల్గొండలో ఇంక్యూబేషన్

# కేంద్రాలు

- ‘టీ-హబ్’ తరహాలో ఏర్పాటు, కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం
- ‘ఫార్మసీ ఆఫ్ పర్పస్’ గా తెలంగాణను మార్చాలన్నదే మా సంకల్పం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మంథని, అక్టోబర్ 11, తెలంగాణ దిశ : తెలంగాణను “ఇన్నోవేషన్ హబ్” గా మార్చాలన్నదే తమ సంకల్పమని, వరంగల్, నల్గొండలోనూ టీ-హబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లుగా వివరించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న ‘కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని’ గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారం భించారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ... సైన్స్ కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజ హితానికి బాటలు వేస్తుందని అభిప్రాయ పడ్డారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్ గా మాత్రమే కాకుండా ‘ఫార్మసీ ఆఫ్ పర్పస్’ గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమ న్నారు. రీసెర్చ్ ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు.

- ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి సాధ్యం అవుతుందా ?
- ప్రజల ఆకాంక్ష మేరకే పథకాలు రూపొందించారా ?
- పేద ప్రజల కోరుకునే సంక్షేమ పథకాలు ఏవి?
- నిరుపేదల బతుకులు మారే ప్రభుత్వాలు పథకాలు కావాలని కోరుకుంతున్న ప్రజలు..




# ఉచిత పథకాలతో మారని జీవన విధానం

ఢిల్లీ :కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలు ఆక్షేపిస్తున్నారా,వాటి వల్ల జీవన విధానంలోఏమైనా మార్పులు కలుగుతున్నాయా? ఉచిత పథకాలతో అభివృద్ధి సాధ్యం అవుతుందా ? లేదా ఎంతవరకు అభివృద్ధి లో పురోగతి సాధించారని ఒక్క సారైన కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు నిరుపేదలతో సర్వేలు చేశాయా అనే విషయాలు ప్రశ్నార్థకంగా మారాయి?. వివధ రాజకీయ పార్టీలు తమకు తామే మెనిఫెస్టో రూపొందించి ఒక పార్టీ కంటే మరొక పార్టీ పథకాలను తమకు ఇష్టానుసారంగా తయారు చేసి ప్రజలను తాత్కాలిక భ్రమలవైపు ప్రలోభ పెట్టి అధికారం కోసం రకరకాల వాగ్దానాలు ఇచ్చి చివరకు ప్రజల అభివృద్ధిని చూడకుండా వారికి నచ్చిన విధంగా ప్రభుత్వాలు నడుపుతున్నారు.

# భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ఉక్కు పాదం

## - ప్రమాదాల నియంత్రణ కోసం పరిశ్రమలు చర్యలు తీసుకోవాలి

## - డైరెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ మోహన్ బాబు





**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 11, (తెలంగాణ దిశ)** :పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని డైరెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్వై.మోహన్ బాబు స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో కౌన్సిల్ ఆఫ్ ఈ హెచ్ ఎస్ ప్రొఫెషనల్స్ (సిఈపి) ఆధ్వర్యంలో పలు పరిశ్రమల యాజమాన్యులు, ఉద్యోగులు, కార్మికుల కోసం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోహన్ బాబు మాట్లాడుతూ పరిశ్రమలలో కార్మికుల భద్రత పట్ల శిక్షణ పొందేటట్లు యాజమాన్యం శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. ఈ తరగతుల వల్ల ప్రమాదాల నివారణ చాలా వరకు తగ్గుతుందని ఆయన అన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఇచ్చే నివేదికలు ముఖ్యం కాదని అన్నారు. ప్రతి పరిశ్రమ జీరో ప్రమాదాల స్థాయికి చేరినప్పుడే పరిశ్రమ వంద శాతం అభివృద్ధి సాధించినట్లు అవుతుందని ఆయన అన్నారు. భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని వారిపై ఉక్కు పాదం మోపుతుందని ఆయన హెచ్చరించారు. ఉద్యోగుల శిక్షణ కోసం కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ఇంటర్నెట్ లో భద్రత ప్రమాణాలపై విషయాలు తెలుసుకొని సైతం క్రింది స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇవ్వవచ్చునని ఆయన అన్నారు. కౌన్సిల్ అఫ్ఈ హెచ్ ఎస్ ప్రొఫెషనల్స్ వారు నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వారిని అభినందించారు.సిఈపి వ్యవస్థాపక అధ్యక్షులు తపస్ సాహ మాట్లాడుతూ నాడు చిన్న వాట్సాప్ గ్రూప్ గా ప్రారంభమైన ఈ సంస్థ నేడు వేల మందితో నడుస్తుందని అన్నారు. నిత్యం పరిశ్రమలలో ఎదుర్కొనే సమస్యల పట్ల శిక్షణ తరగతులు నిర్వహిస్తూ పారిశ్రామిక రంగాలలో చేసే ప్రతి ఉద్యోగులకు శిక్షణ లభించే విధంగా కృషి చేస్తుందని ఆయన అన్నారు. యాజమా న్యం భద్రత ప్రమాణాల విషయాలలో పూర్తిగా సహకరిస్తున్నాయని ఆయన అన్నారు. చిన్న చిన్న ఉద్యోగులతో ప్రారంభమైన ఈ సంస్థ చేసే ప్రతి శిక్షణా కార్యక్రమం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోభిందో, ఆపిటోరియా ఫార్మా ఈ హెచ్ ఎస్ జనరల్ మేనేజర్ అమర్ కూడాలే, బిఎస్ బి సేఫ్టీ సిస్టమ్స్ చెన్నై రాష్ట్ర అధ్యక్షుడు బి జయ, శంకర్, గ్రాన్యూవల్స్ ఇండియా లిమిటెడ్ ఈ హెచ్ ఎస్ వైస్ ప్రెసిడెంట్ మెట్లపల్లి శ్రీనివాస్, 3ఎం జనరల్ మేనేజర్ ఏ సందీప్ కుమార్, వియాష్ లైఫ్ సెన్స్ ఈ హెచ్ ఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సాంసన్, కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ సభ్యులు ఏ సూర్య ప్రకాష్, ఈ తిరుపతి,పి రామకృష్ణ, చంద్రకాంత్, జి.జగదీష్, ఎ.మురళీకృష్ణ, హరిబుకీయతోపాటు సుమారు 72 పరిశ్రమల ప్రతినిధులు శిక్షణ తరగతులలో పాల్గొన్నారు.



# నేడు పల్స్ పోలియో

## : డాక్టర్ రమాదేవి



**కాప్రా, అక్టోబర్ 11, (తెలంగాణ దిశ) :** కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జమ్మిగడ్డ ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్ర మాన్ని 55 బూత్ లలో ఏర్పాటు చేసినట్లు పిహెచ్ సి ఇంచార్జ్ డాక్టర్ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 0 నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో మోతాదు ఇవ్వడం జరుగుతు ందన్నారు. అనంతరం 13 నుంచి 15వ తేదీ వరకు గృహ సందర్శనల ద్వారా పోలియో చుక్కల పంపిణీ కార్యక్ర మాన్ని చేపడతామన్నారు. పల్స్ పోలియో కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

## - కాప్రా తహసిల్దార్ సుచరిత





**కాప్రా, అక్టోబర్ 11, (తెలంగాణ దిశ) :**సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాప్రా తహసిల్దార్ సుచరిత అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాప్రా తహసిల్దార్ సుచరిత అధ్యక్షతన సమాచార హక్కు చట్టం అవగాహన సమావేశం శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడంతోపాటు ఇందుకు సంబంధించిన కాపీలను సమావేశానికి హాజరైన వారికి అంద జేశారు.

తొలుత కాప్రా డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చట్టంలో ఉన్న సెక్షన్లు, వాటి యొక్క అమలు ఏ విధంగా జరుగుతుందో వివరించారు. అనంతరం సమాచార హక్కు చట్టం అమలుపై సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ మాట్లా డుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుని చేతుల్లో వజ్రాయుధమని అన్నారు. తద్వారా అవినీతి అక్రమాలు బయట పెట్టవచ్చునని అన్నారు. ప్రస్తుతం సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పటికీ మండల అధికారులు కాస్త నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఆర్టీఐ ద్వారా వచ్చే దరఖాస్తులు ప్రజా ప్రయోజనాల నిమిత్తం మాత్రమేనని అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూములు కాపాడే విషయంలో భాగంగా ఆర్టీఐ దరఖాస్తు చేసినప్పుడు అధికారులు ఆలస్యం చేయకుండా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చట్టం అమలు ప్రక్రియపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మహేందర్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, ఆర్టీఐ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుల నియామకంపై కసరత్తు







**ఖైరతాబాద్, అక్టోబర్ 11, (తెలంగాణ దిశ) :** కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుల నియామకంపై కసరత్తు ప్రారంభించారు. ఖైరతాబాద్ జిల్లాకు సంబంధించి డిసిసి నియామకం అంశంపై ఏఐసీసీ పరిశీలకులుగా శక్తి సింగ్ గోయల్ ను నియమించారు. ఆయన శనివారం గాంధీ భవన్లో జిల్లా ముఖ్యులతో ముఖాముఖి సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యురాలు, గోషామహల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగలి సునీత రావు శక్తి సింగ్ గోయల్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నియామకంపై చర్చ జరిగింది.

# కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నియామకానికి కసరత్తు

## - పరిశీలకురాలిగా అంజలి నింబాల్కర్





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11, (తెలంగాణ దిశ) :**జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామకానికి కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా పరిశీలకురాలిగా అంజలి నింబాల్కర్ ను నియమించింది. శుక్రవారం ఆమె జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆశావాహులైన కాంగ్రెస్ నేతలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. మేడ్చల్ లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆశావాహల నుంచి డిసిసి నియామకం కోసం బయోడేటాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య నాయకులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఆర్గనైజర్లు, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ పి. విజయ రెడ్డి, మల్కాజిగిరి నియోజకవర్గ ఇంచార్జీ మైనంపల్లి హనుమంత్ రావు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హనుమంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జీ బండి రమేష్, మాజీ శాసన సభ్యులు కూన శ్రీశైలం గౌడ్, మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి తదితరులు హాజరయ్యారు.




# జమ్మిగడ్డలో రూ. 12 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా చెర నుంచి విముక్తి

## - మీడియా ముసుగులో రిపోర్టర్ విజయ్ భూ...దందా.

## - స్వాధీనం చేసుకున్న కాప్రా తహసిల్దార్ సుచరిత

## - స్థలానికి ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం



**కుషాయిగూడ, అక్టోబర్ 11, (తెలంగాణ దిశ) :** జమ్మిగడ్డలోని సర్వే నెంబర్లు 1991 376 లలో సుమారు 12 గుంటల ప్రభుత్వ భూమిని శుక్రవారం కాప్రా తహసిల్దార్ సుచరిత కబ్జా చెరనుంచి స్వాధీనం చేసుకున్నారు. స్థలానికి తక్షణమే ఫెన్సింగ్ వేయాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిపిఎస్ సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇది ప్రభుత్వ స్థలం అని పేర్కొంటూ సదరు స్థలంలో బోర్డులు నాటారు. సర్వేయర్ తో కొలతలు తీయించి మార్కింగ్ చేశారు. శనివారం స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న స్థలాన్ని ప్రజా అవసరాల కోసం ఉపయోగిస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. 24 గంటల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల విషయంలో కఠినంగా వ్యవహరించి స్వాధీనం చేసుకున్న తహసిల్దార్ సుచరితను సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గగన్ కుమార్ అభినందించారు. ఈ భూములను భవిష్యత్తులో ప్రజా అవసరాలకు ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ సర్వేయర్ మహేందర్ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మీడియా (ఈనాడు మాజీ విలేఖరి) ముసుగులో విజయ్ భూ...దందా...

**మీడియా ముసుగులో విజయ్ అనే వ్యక్తి అధికారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ స్థలాన్ని పప్పు బెల్లాల దోచుకుతింటున్నట్లు స్పష్టమైంది. సదరు ప్రభుత్వ స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించి లోపల గృహాలను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నూతనంగా నిర్మించిన గృహాలను సైతం స్వాధీనం చేసుకుం టామని తహసిల్దార్ సుచరిత స్పష్టం చేశారు. గతంలో ఈనాడు దినపత్రికలో ప్రస్తుతం దిశ దినపత్రికలో విలేకరిగా కొనసాగుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసి గృహాలను నిర్మించి అమ్ముకుంటున్నాడని అధికారులు గుర్తించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారైనా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని తహసిల్దార్ హెచ్చరించారు.**




# అట్టహాసంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి చదరంగ పోటీలు ప్రారంభం







**కాప్రా, అక్టోబర్ 11, (తెలంగాణ దిశ)** :కాప్రాలోని విజయ హైస్కూల్ శనివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి చదరంగ పోటీలు అండర్ 14, 17 బాలికల, బాలుర చదరంగ పోటీలు ప్రారంభోత్సవం ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో మొత్తం 60 పాఠశాలల నుండి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజయ హైస్కూల్ కరెస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ జి.రమేష్ రెడ్డిల ముఖ్య అతిథులుగా హాజరై చదరంగం పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని అన్నారు. విద్యాభివృద్ధిలో క్రీడలు భాగమేనన్నారు.

క్రీడల్లో రాణించే వారి భవిష్యత్తు బంగారు బాట అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ హైస్కూల్ ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, మేడ్చల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. కిష్టయ్య, జిహెచ్ఎం డి. ప్రభాకర్, మాజీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ. కె సత్యనారాయణ, పిడిలు మదన్మోహన్ రెడ్డి, వీరారెడ్డి, వినోద్, విద్యాసాగర్, యాదలక్ష్మి, రూబీ, సునీత, వివిధ పాఠశాలల నుండి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ జిల్లా స్థాయి చదరంగ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే చదరంగ పోటీలలోహాపాల్గొంటారు.

# సంపాదకీయం

## మావోయిస్టుల్లో మార్పు సాధ్యమేనా..?

ఆపరేషన్ కగార్.. మావోయిస్టులను కంగారెత్తిస్తున్నాయి. అందుకే కాల్పుల విరమణ పాటిద్దాం.. చర్చలకు సిద్ధం అని చెప్పడం సంచలనంగా మారింది. ఇకపై ప్రజాపోరాటాల్లో పాల్గొంటామన్న మావోలు. మావోయిస్టు పార్టీ తీసుకున్న సంచలన నిర్ణయం చుట్టూ పెద్ద కథే నడుస్తోంది. ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేటెస్ట్ గా ఒక ప్రకటన రిలీజ్ అయింది. అభయ్ పేరుతో చలామణి అవుతున్న కిషన్ సోదరుడు మల్లోజుల వేణుగోపాల్ ఫోటోను తాజా స్టేట్ మెంట్లో ప్రింట్ చేశారు. అంతే కాదు ప్రజాభిప్రాయాలు పంచుకునేందుకు ఫేస్ బుక్, ఈ మెయిల్ ఐడీలను జత చేశారు. నిజానికి మావోయిస్టులు గతంలో ఎన్నడూ ఇలా చేసిన దాఖలాల్లేవు. కానీ ఇది నిజమే అంటున్నారు. నెల రోజుల తర్వాత బయటికొచ్చిన స్టేట్మెంట్. ఆగస్టు 15వ తేదీతో ఉన్న ఈ స్టేట్ మెంట్ నెల రోజుల తర్వాత అంటే సెప్టెంబర్ 16న రాత్రి వెలుగులోకి వచ్చింది. శాంతి చర్చకు సిద్ధమే అన్న సంకేతాలు పంపారు. ఈఏడాది మార్చి నుంచి మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వంతో శాంతిచర్చలకు నిజాయతీగా ప్రయత్నిస్తోందని, మే 10న పార్టీ ప్రధాన కార్యదర్శి స్వయంగా పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఆయుధాలను వదులుకుంటున్నట్లు ప్రస్తావించారు. ప్రభుత్వానికి కాల్పుల విరమణ ప్రతిపాదించారు. అయితే కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా రియాక్ట్ కాలేదు. ఒకవైపు తుపాకులు చేతబట్టి ఇంకోవైపు చర్చలు అంటే ఎలా అని కృశ్చన్ కూడా చేశారు. వీటికి తోడు 2024 జనవరి నుంచి బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేయించి దొరికితే ఎన్ కౌంటర్ అన్నట్లుగా వ్యవహారం నడిపిస్తోంది. చాలా మంది ఎన్ కౌంటర్లలో హతమయ్యారు. ఇందులో పార్టీ అగ్రనేతల నుంచి కామన్ మావోయిస్టుల దాకా ఉన్నారు. మే 21న గుండెకోట్ సమీపంలో జరిగిన భీకర దాడిలో పార్టీ ప్రధానకార్యదర్శి బస్వరాజ్‌తో పాటు 28 మంది చనిపోయారు. ఆపరేషన్ కగార్‌ను స్పీడప్ చేసిన కేంద్రం. పైగా కేంద్రం ఆపరేషన్ కగార్ ను స్పీడప్ చేసింది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల అంతమే పంతంగా ముందుకెళ్తోంది. మొన్నటికి మొన్న కర్రెగుట్టల్ని జల్లెడ పట్టి కథ ముగించారు. ఇంకా కూంబింగ్స్ పెద్ద ఎత్తున సాగుతున్నాయి. గ్రౌండ్ నుంచి హెలికాప్టర్ల ఇలా అన్ని చోట్లా గాలింపు పెరగడంతో మావోయిస్టులకు షెల్టర్ కరువైంది. దీంతో బస్వరాజ్ ఆలోచనలకు తగ్గట్లుగా శాంతిచర్చలను ముందుకు తీసుకెళ్లాలని తాము నిర్ణయించుకున్నామంటోంది మావోయిస్టు పార్టీ. ఆయుధాలు విదిలి జనజీవన స్రవంతిలో కలవాలన్న ప్రధాని సూచనతో తాము వెపన్స్ వదిలేయాలని డిసైడ్ చేసుకున్నామంటున్నారు. హోంమంత్రి లేదంటే ఆయన ప్రతినిధి ఎవర్ని నియమించినా చర్చలకు సిద్ధమంటున్నారు. అయితే తమ అభిప్రాయం చెప్పడానికి తమ ఇతర సహచరులు, అలాగే జైళ్లలో ఉన్న మావోయిస్టు నేతలను సంప్రదించి నిర్ణయం ప్రకటిస్తామని, ఇందుకోసం నెల రోజుల టైం ఇవ్వాలన్నారు. ఆ లోపు కూంబింగ్ వద్దు.. బలగాల కాల్పులు వద్దు అని కోరుకుంటున్నారు. చర్చల విషయంలో ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారానైనా తమ అభిప్రాయాలను పంచుకోవడానికి రెడీ అంటున్నారు. సో ఇప్పుడు అసలు గేమ్ షురూ కాబోతోంది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల్ని నామరూపాల్లేకుండా చేయాలని, పూర్తిగా రెడ్ కారిడార్ అన్నదే లేకుండా చేయాలన్న లక్ష్యంతో కేంద్రం ఉంది. అయితే మావోయిస్టులను లొంగిపోయేలా చేయడం, లేదంటే ఎన్ కౌంటర్లలో హతమార్చడం ఈ రెండే టార్గెట్. మధ్యలో చర్చలకు తావు లేదని కేంద్రం అంటోంది. మరి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందన్నది కీలకంగా మారింది. మావోయిస్టుల్లో ఇప్పుడు అగ్రనేతలంతా చాలా వరకు ఎన్ కౌంటర్ అయ్యారు. కొందరే మిగిలారు. అందులో చాలా మంది లొంగిపోవడానికి రెడీగా లేరు. చావో రేవో అంటున్నారు. అటు మరికొందరు కగార్ తో ఏ ఒక్కరు కూడా బతికే పరిస్థితి లేదంటున్నారు. అందుకే ఆయుధాలు వదిలి చర్చలకు ప్రయత్నిద్దామని చెప్పి ఇలా లేఖ రిలీజ్ చేశారా? అసలు ఈ లేఖ నిజమా కాదా అన్నది కూడా మరో డౌట్ గా మారింది. మరిప్పుడు గేమ్ ఎలా మారబోతోంది? జనంలోనే ఉండి పోరాటాలు చేస్తారా? కేంద్ర ప్రభుత్వం అస్సలు ఛాన్స్ ఇవ్వట్లేదు. ఈ మొత్తం ఎపిసోడ్ లో సామాన్యులకు ఇబ్బందులు వస్తున్నాయని, కోవర్టులని, మరొకటని సమస్యలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. దీంతో ఏ ప్రజల కోసమైతే అడవుల బాట పట్టారో ఇప్పుడు జనంలోనే ఉండి ప్రజాపోరాటాలు చేయాలన్న నిర్ణయానికి మావోలు వచ్చారా అన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ మావోయిస్టులు నిజంగానే తుపాకులు వదిలి జనజీవన స్రవంతిలోకి వస్తే వెనుకబడిన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందంటున్నారు. నిజానికి కేంద్రం ప్రభుత్వం మావోయిస్టులతో అసలు చర్చలే లేవంటోంది. అయితే లొంగిపోవడం, లేదంటే ఎన్ కౌంటర్ అవడం రెండే ఆప్షన్లు ఇచ్చింది. సో నెల రోజులు కాల్పుల విరమణ కొనసాగుతుందా లేదా అన్నది కూడా పెద్ద డౌటే. తెలంగాణ, ఏపీ, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర ఇలా రెడ్ కారిడార్ ఏరియాల్లో అగ్రనేతలంతా ఒక్కొక్కరుగా వచ్చి డీజీపీలు, ఐజీలు ఇలా పోలీస్ ఆఫీసర్ల ముందు లొంగిపోతున్నారు. ఇటీవలే తెలంగాణలో డీజీపీ ముందు సుజాతక్క సరెండర్ అయ్యారు. మావోలకు బలగాలపై తిరగబడే పరిస్థితి ఉందా? సో కేంద్ర ప్రభుత్వం సిగ్నల్స్ ప్రకారం చూస్తే మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని వదులుకోవడమే మార్గంగా కనిపిస్తోంది. బలగాలపై తిరగబడే పరిస్థితి అసలే లేదు. సామాజిక సమస్యలపై దృష్టి పెట్టి ప్రజా పోరాటాలే చేయడం మార్గం ఉంది. సో ఫైనల్ గా మావోయిస్టు ఉద్యమంలో బిగ్ ట్విస్ట్ వచ్చినట్లైంది. ఆపరేషన్ కగార్ ఎఫెక్ట్ తో కథ మారిపోతోంది. పెద్ద ఎత్తున సరెండర్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 600 మంది వరకు మావోయిస్టులు అరెస్ట్ అవడం లేదంటే లొంగిపోవడం జరిగాయి. గత 16 నెలల్లో 1600 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. సిపిఐ మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ పూర్తి సరెండర్‌కు రెడీ అని ప్రకటించడం వెనుక పెద్ద కారణాలే ఉన్నాయి. ఈ ఏడాది 192 మంది ఎన్ కౌంటర్ అయ్యారు. గత 9 నెలల్లో 210 మంది, గత 15 నెలల్లో 400 మంది హతమయ్యారు. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. ఎందుకంటే సైనిక బలగాలు డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లక్ష మంది పారా-మిలిటరీ బలగాలతో హైటెక్ ఆపరేషన్లు చేస్తున్నాయి. దీంతో మావోయిస్టులు ఎక్కడా తలదాచుకోలేపోతున్నారు. వారి జాడను ఈజీగా పసిగట్టేస్తున్నాయి. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 31 మంది హతం. 2025 మేలో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 31 మంది మావోయిస్టులు హతమయ్యారు. సో ఇప్పుడు కాల్పుల విరమణ, అలాగే చర్చలు అంటూ మావోలు ప్రతిపాదన పెట్టడం వెనుక భారీ వ్యూహమే ఉందంటున్నారు. ఒక నెల రోజులు ఆపరేషన్ కగార్ ఆగితే.. రీ గ్రూప్ అవ్వొచ్చని, బలపడేలా రిక్రూట్ చేసుకోవడం, అడవుల్లో కాకుండా జనంలో కలిసి తిరగడం ఇలాంటి నయా స్ట్రాటజీల కోసం వ్యవహారం నడుపుతున్నారా అన్నది కూడా డౌట్ ఫుల్ గా మారుతోంది. ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం 40 వేల చదరపు కిలోమీటర్ల నుంచి 18 జిల్లాలకు తగ్గింది. అగ్రనాయకత్వం ఎన్ కౌంటర్ అయింది. ఉమ్మడి ఏపీ ఉన్నప్పుడు మావోలతో చర్చలు జరిగాయి. అయితే అవి విఫలమయ్యాయి. ఆ టైంలో మావోయిస్టులు అఫీషియల్ గా రీగ్రూప్ అయ్యారు.

# హాట్ టాపిక్ గా కవిత వ్యాఖ్యలు



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు.. మళ్లీ హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావు గురించి ఆమె చేసిన ఆరోపణలు, అలాగే తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై వెల్లడించిన అంశాలు చర్చనీ యాంశమయ్యాయి. హరీష్ రావుపై ఆరోపణలు. మీడియాతో మాట్లాడిన కవిత, హరీష్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు భారీ అవినీతి చోటుచేసుకుందని ఆమె నేరుగా ఆరోపించారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావిస్తూ.. 2016లోనే నేను కేటీఆర్‌ను ఈ విషయంలో అలర్ట్ చేశాను, అని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాను అప్పుడే సమస్యలను చూపించినా, నిర్ణయాలు మాత్రం పూర్తిగా కేసీఆర్ పరిధిలోనే జరిగాయని అన్నారు. ప్రతి నిర్ణయం కేసీఆర్ దేనని హరీష్ రావు పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారనే విషయాన్ని కూడా గుర్తుచేశారు. హరీష్ రావుపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి విభేదాలు లేవని. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తప్ప మరే విషయంలోనూ నాకు ఆయనపై కోపం లేదు అని చెప్పి, తన విమర్శలు పూర్తిగా పరిపాలనా విధానాలకే సంబంధించినవని వివరించారు. కొత్త పార్టీపై కవిత వ్యాఖ్యలు. ఇటీవలి కాలంలో కవిత కొత్త పార్టీ స్థాపనపై చర్చలు ఎక్కువయ్యాయి. దీనిపై ఆమె క్లారిటీ ఇస్తూ కొత్త పార్టీ పెట్టాలా లేదా అనే అంశంపై నేను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అని చెప్పారు. రాజకీయంగా తన తదుపరి అడుగులపై అన్ని వర్గాల వారితో చర్చలు జరుపుతున్నానని వివరించారు. ఒక వర్గం కోసం కాదు.. ప్రజలందరి కోసం పని చేయాలనుకుంటున్నాను.. బీసీ సమస్య నా మనసుకు దగ్గరైంది.. ప్రస్తుతం ఫ్రీ బర్డ్?ని.. నా ద్వారాలు తెరిచె ఉన్నాయి.. చాలా మంది వచ్చి నన్ను కలుస్తున్నారు.. నాతో టచ్?లో ఉన్న బీఆర్‌ఎస్ నేతల లిస్ట్ చాలా పెద్దిది అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె తన తండ్రి కేసీఆర్ విధానాన్ని గుర్తు చేశారు. పార్టీ పెట్టేముందు కేసీఆర్ వందల మందితో చర్చలు జరిపారు. ప్రస్తుతం నేనూ అదే చేస్తున్నాను అని చెప్పారు.

అంటే త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం కంటే, పరిస్థితులను సమీక్షించి తర్వాతే నిర్ణయం తీసుకుంటానని ఆమె అర్థం చేశారు. కాంగ్రెస్‌లో చేరే ఆలోచనలేదని స్పష్టం. కవిత మరోసారి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాన్ని పూర్తిగా ఖండించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన నాకు అస్సలు లేదు. కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. నేనూ కాంగ్రెస్‌లో ఎవరినీ అప్రోచ్ కాలేదు అని ఆమె స్పష్టంగా చెప్పారు. సస్పెన్షన్ అంశంపై వ్యాఖ్య. తండ్రి పార్టీ నుండి సస్పెండ్ అయిన తన పరిస్థితిని గుర్తుచేసుకుంటూ, తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతుర్ని నేనే అని అన్నారు. ఈ వ్యాఖ్య ద్వారా కుటుంబ రాజకీయ పరిణామాల్లో తనకు ఎదురైన కష్టాలను గుర్తు చేస్తూనే, ఆ అనుభవం తనను మరింత బలపరిచిందని సూచించారు. రాజకీయ పరిశీలన. కవిత తాజా వ్యాఖ్యలు రాజకీయ రంగంలో.. అనేక ప్రశ్నలను తెచ్చాయి. హరీష్ రావుపై అవినీతి ఆరోపణలు చేయడం ఒకవైపు బీఆర్‌ఎస్‌లో ఉన్న పాత విభేదాలను మళ్లీ తెరమీదకు తెచ్చింది.

మరోవైపు కొత్త పార్టీ అంశంపై స్పష్టత ఇవ్వకుండా ఉంచడం, ప్రజలతో, మీడియాతో చర్చల్లో తన ప్రాధాన్యతను నిలుపుకోవడానికి ఒక వ్యూహంగా కనిపిస్తోంది. మొత్తానికి, కవిత వ్యాఖ్యలు ఒక వైపు బీఆర్‌ఎస్‌లోని అంతర్గత రాజకీయాలను కదిలిస్తే,

మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో తన స్వంత స్థానం ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్న సంకేతాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే నెలల్లో ఆమె తీసుకునే నిర్ణయాలు రాజకీయ సమీకరణాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో నుంచి ఎందుకు వెళ్లిపోతోంది?

**హైదరాబాద్, తెలంగాణ దిశ:** హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలంగా మెట్రో రైల్ ను ఎల్ అండ్ టీ సంస్థ నిర్వహిస్తోంది.. సేవల విషయం లోనూ సమర్థవంతంగా వ్యవహరిస్తోంది. అయితే అటువంటి సంస్థ మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి తప్పుకుంటామని వ్యాఖ్యానించడం సంచలనం కలిగిస్తోంది. దీనికి తోడు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కేటీఆర్ ముడుపుల వల్లే ఎల్ అండ్ టీ మెట్రో నుంచి వెళ్ళిపోతోందని ఆరోపించారు. దీంతో ఎల్ అండ్ టీ వ్యవహారం రాజకీయంగా సంచలనంగా మారింది..మెట్రో ప్రాజెక్ట్ నుంచి పదేపదే వెళ్ళిపోతామని ఎల్ అండ్ టీ చెబుతుండడం పట్ల రేవంత్ ప్రభుత్వం కూడా సీరియస్ గానే దృష్టి సారించినట్టు తెలుస్తోంది.. పదేపదే వెళ్ళిపోతామని చెబితే.. దానికి తాము సరే అంటామని ప్రభుత్వం చెప్పినట్టు తెలుస్తోంది. మెట్రో రెండో దశ ప్రాజెక్టు ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి.. నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఈ పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి దశ కూడా తామే నిర్వహిస్తామని ప్రభుత్వం ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది.. అప్పులు, వడ్డీలు అధికంగా ఉన్నాయని ఎల్ అండ్ టీ చెబుతుండగా.. ఇచ్చిన ఆస్తులు నిర్వహణ సరిగా లేదని ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. అంతర్గతంగాను మెట్రో రైలు నిర్వహణ తనకు ఏమాత్రం ఉపయుక్తంగా లేదని ఎల్ అండ్ టీ అంతర్గతంగా వ్యాఖ్యానించింది. లేఖలు కూడా రాసింది.. మరోవైపు రెండోదశ నిర్మాణానికి సంబంధించి మొదటి విడతలో 24,259 కోట్లు, రెండవ విడుదల 19,450 కోట్లతో ప్రభుత్వమే విస్తరణ చేపడుతుందని ఇటీవల ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. హైదరాబాదులో మెట్రో డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను మెట్రో రైలు తో అనుసంధానించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇంతటి భారీ విస్తరణకు ప్రణాళికలు చేపట్టిన ప్రభుత్వం.. మొదటి విడత నిర్వహణను చేతుల్లోకి తీసుకోవడానికి ఇబ్బంది ఉండదని భావిస్తోంది. అయితే ప్రభుత్వం తానంతట తానుగా ఆ ప్రతిపాదన పెట్టదని.. ఒకవేళ ఎల్ అండ్ టీ ఓకే అంటే మాత్రం వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సర్కార్ ఉన్నట్టు తెలుస్తోంది. మనదేశంలో చాలా రాష్ట్రాలలో ప్రభుత్వాలే మెట్రో రైలు వ్యవస్థను నిర్వహిస్తున్నాయి. తెలంగాణలో కూడా అదే విధంగా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అవసరమైతే దీనికోసం ఒక ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వ మదిలో ఉంది. నిధుల సమీకరణ కూడా దీనికోసం పనికి వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఎల్ అండ్ టీ కి కేటాయించిన ఆస్తుల విషయంలో నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. ఆస్తుల నిర్వహణ కూడా ప్రభుత్వం చేతికి వస్తే ఆర్థికంగా భారం




కూడా ఉండదని తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో మెట్రో నిర్వహణ ఆర్థిక భారం అవుతుందని. ప్రాజెక్టు కోసం భారీగా పెట్టుబడులు పెట్టినప్పటికీ, ఆర్థిక లాభాలు అనుకున్న స్థాయిలో లభించడం లేదని కంపెనీ ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే నిర్వహణ బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వీకరించాలనీ, ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ను ఏర్పాటు చేయాలని కోరింది.

ఎందుకు భారం అవుతోంది? హైదరాబాద్ మెట్రోను నిర్మించడానికి ఒడు సుమారు 20,000 కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడి పెట్టింది. ప్రాజెక్టు ప్రారంభ దశలో మంచి ఆదాయం వస్తుందని కంపెనీ అంచనా వేసింది. కానీ వాస్తవంలో కొన్ని ప్రధాన సమస్యలు తలెత్తాయి. కోవిడ్ ప్రభావం ? మహమ్మారి సమయంలో ప్రయాణికుల సంఖ్య తీవ్రంగా పడిపోయింది.

ఇంకా పూర్తిగా రికవరీ కాలేదు. ఆపరేషనల్ ఖర్చులు ఎక్కువ ? మెట్రో నడపడం, సిబ్బందికి వేతనాలు, విద్యుత్ ఖర్చులు, నిర్వహణా వ్యయాలు అన్నీ భారీగా పెరుగుతున్నాయి. అంచనాలకు తగ్గ ప్రయాణికులు ? రోజుకు 10?12 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా. కానీ ఇప్పటికీ 5?6 లక్షల మందికి మించి ప్రయాణికులు లేరు. రుణ భారం ? ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులు, వాటిపై వడ్డీలు కంపెనీకి భారమవుతున్నాయి. ఈ కారణాల వల్లకి నిర్వహణలో ఆర్థిక ఒత్తిడి పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర. ప్రస్తుతం మెట్రో ప్రాజెక్టు పూర్తిగా పబ్లిక్-ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ మోడల్‌లో నడుస్తోంది. ఇందులో ప్రభుత్వాలు భూసేకరణ, అనుమతులు, పాలసీ మద్దతు వంటి సహకారం అందించాయి. కానీ ఆర్థికపరంగా మొత్తం బాధ్యతదే. ఇప్పుడు పరిస్థితులు మారడంతో, కోరుతుంది. నిర్వహణను ప్రభుత్వాలు స్వీకరించాలి. ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి దానిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే భాగస్వాములుగా ఉండాలి. దీని ద్వారా ప్రాజెక్టు కొనసాగింపు, అభివృద్ధి సజావుగా సాగుతుంది. ఒక ప్రత్యేక వాహకం ఏర్పాటు చేస్తే అనేక లాభాలు ఉంటాయి. ఆర్థిక స్థిరత్వం ? ప్రభుత్వాల మద్దతుతో నిధులు సమకూరుతాయి. పబ్లిక్ ఇంటరెస్ట్ ప్రాధాన్యం ? లాభాల కంటే ప్రజా సేవలకు ప్రాముఖ్యత ఉంటుంది. విస్తరణ సులభతరం ? భవిష్యత్‌లో కొత్త కారిడార్లు, లింకులు సులభంగా నిర్మించవచ్చు. ప్రజల నమ్మకం పెరుగుతుంది ? ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం వల్ల మెట్రో సేవలపై విశ్వాసం పెరుగుతుంది. భవిష్యత్‌లో పరిష్కార మార్గాలు. హైదరాబాద్ మెట్రో దీర్ఘకాలంలో.. విజయవంతం కావాలంటే కొన్ని చర్యలు అవసరం. ప్రయాణికుల సంఖ్య పెంచడం ? బస్సులు, మెట్రో, ఓఓూ మధ్య ఇంటిగ్రేషన్ బలోపేతం చేయాలి. రాజకీయ మద్దతు ? కేంద్రం, రాష్ట్రం కలిసి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలి. ఆదాయ వనరుల విస్తరణ ? టికెట్ ధరల కంటే, ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, కమర్షియల్ స్పేస్‌ల ద్వారా ఆదాయం పెంచాలి. సాంకేతికత వినియోగం ? స్మార్ట్ కార్డ్, మొబైల్ యాప్‌లు, డిజిటల్ టికెట్టింగ్ ద్వారా సౌకర్యాన్ని పెంచాలి. హైదరాబాద్ మెట్రో నగరానికి ప్రాణాధారం వంటిది. కానీ దాని నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించకపోతే, భవిష్యత్‌లో ఇది పెద్ద సమస్యగా మారే అవకాశం ఉంది. ఒడు లేఖ ద్వారా వచ్చిన సంకేతం స్పష్టమే ? ఒక ప్రైవేట్ కంపెనీకి మాత్రమే ఇది భారం అవుతోంది. కాబట్టి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఏర్పాటు చేస్తే, మెట్రో ప్రాజెక్టు మరింత స్థిరత్వం పొందుతుంది.

# 15 వేల కోట్ల స్థలాలు రక్షించాం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** ఐటీ కారిడార్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉండే గాజులరామారం ప్రాంతంలో ప్రభుత్వ భూములు భారీ స్థాయిలో ఆక్రమణలకు గురయ్యాయని హైడ్రా గుర్తించింది. మొత్తం 300 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా.. అందులో 100 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. ఆ ఆక్రమించిన భూమిలో కొందరు 60 నుంచి 70 గజాలు, 80 గజాల పరిమాణంలో ఇళ్లు నిర్మించి, రూ.10 లక్షలకు విక్రయిస్తున్నట్టు హైడ్రా అధికారులు గుర్తించారు. ఆదివారం ఉదయం నుంచి అక్రమ నిర్మాల తొలగింపు పనులు చేపట్టిన హైడ్రా అధికారులు నివాసాల జోలికి వెళ్లకుండా ఆక్రమణల తొలగిస్తున్నట్లు చెప్పారు.గాజుల రామారంలో అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. సర్వే నంబర్ 307లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసింది. ఆక్రమణదారుల చేతుల్లో దాదాపు రూ.4,500 నుంచి 5000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఉన్నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసుల సహకారంతో గాజులరామారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. హైడ్రా అధికారుల చర్యలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము లక్షల్లో డబ్బులు చెల్లించి ఇంటిని కొనుక్కున్నామని, అమ్మినవారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా తమ నివాసాలను కూల్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చర్యలను నిరసిస్తూ చిన్న పిల్లలతో కలిసి జేసీబీ వాహనాలకు అడ్డుగా నిలబడి వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం గాజులరామారంలో మొత్తం 300 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా, ఇందులో 100 ఎకరాలు ఇప్పటికే ఆక్రమణకు గురైనట్లు హైడ్రా స్పష్టం చేసింది. వంద ఎకరాల్లో అక్రమ కట్టడాల కూల్చివేత అనంతరం మిగిలిన 200 ఎకరాల భూమిని సైతం కాపాడేందుకు హైడ్రా రూ.15 వేల కోట్ల విలువ గల 300 ఎకరాల భూమికి కంచె వేయాలని యోచిస్తోంది. గాజులరామారం, ఐటీ కారిడార్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. హౌసింగ్ బోర్డు వంటి సంస్థలకు గత ప్రభుత్వాలు భూములు కేటాయించినా, వాటిని అభివృద్ధి చేయకపోవడంతో కొందరు కబ్జాదారులు గ్రూపులుగా ఏర్పడి ఆ భూములను ఆక్రమించారు. కొందరు నేరుగా ప్లాట్లు విక్రయించగా, కొందరు చిన్న ఇండ్లు కట్టి బడ్జెట్ ధరలలో అమ్మేస్తున్నారు. కేవలం

4 ఏళ్లలోనే 100 ఎకరాల భూమి కబ్జా

కేవలం 3, 4 ఏళ్లలోనే 103 ఎకరాల భూమిని ఆక్రమించారని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో ఎకరా మార్కెట్ విలువ రూ.40 నుండి రూ.50 కోట్లు ఉంది. దాంతో ఆక్రమణలో ఉన్న భూముల విలువ రూ.4,500 నుంచి 5000 కోట్ల మధ్య ఉంటుందని తెలిపారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం, చింతల్ పరిసరాల్లో ఉండే వారిని తక్కువ ధర అని ఆకర్షించి సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి అమ్ముతున్నారు. తమకు రెవెన్యూ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారుల నుంచి పర్మిషన్ వచ్చిందని, బిల్లులు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. తక్కువ ధరలకే ఇంటిని సొంతం చేసుకోవాలని కొంతమంది అప్పులు చేసి మరీ ఇళ్లు కొనుగోలు చేస్తున్నారు. కబ్జా భూములపై ఫోకస్ చేసిన హైడ్రా అధికారులకు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో గాజులరామారంలో ప్రభుత్వ భూమి కబ్జా, అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. అయితే వీటిని విక్రయించిన కబ్జాదారులతో పాటు పర్మిషన్లు ఇచ్చిన అధికారులు, సిబ్బందిపై ముందుగా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆ ప్రాంత వాసులు హైడ్రా అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# క్యారెట్ జ్యూస్‌ను అసలు రోజూ ఎంత తాగాలి..?



మనకు అందుబాటులో ఉన్న అనేక రకాల కూరగాయల్లో క్యారెట్లు కూడా ఒకటి. వీటిని చాలా మంది తరచూ ఉపయోగిస్తుంటారు. క్యారెట్లను నేరుగా అలాగే తినవచ్చు. లేదా కూరల్లో వేసి వండుకుని తినవచ్చు.అయితే క్యారెట్లను రోజూతినడం కష్టంగాఉందని భావించే వారు వీటితో జ్యూస్ తయారు చేసి నిల్వ చేసుకుంటే దాన్ని రోజూ కొద్ది మొత్తంలో తాగవచ్చు. క్యారెట్ జ్యూస్‌ను రోజుకు 120 ఎంఎల్ మోతాదులో తాగితే చాలు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. ఇక పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం క్యారెట్ జ్యూస్‌ను ఉదయం పరగడుపునే సేవించాలి. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు. క్యారెట్ జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల పలు వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ జ్యూస్ మనకు ఎంతగానో మేలు చేస్తుందని అంటున్నారు.

**కళ్ల ఆరోగ్యానికి..:** క్యారెట్లలో బీటా కెరోటిన్, లుటీన్, జియాజాంతిన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కళ్లకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. వృద్ధాప్యం కారణంగా కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకుంటాయి. దీంతో కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. క్యారెట్ లలో విటమిన్ సి, ఎ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో శరీరం ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు,

## ఏ సమయంలో తాగితే మంచిది..?


జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

**చర్మ సంరక్షణకు..:** క్యారెట్ జ్యూస్‌ను తాగడం వల్ల అందులో ఉండే బీటా కెరోటిన్ చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. సూర్యకాంతి వల్ల చర్మానికి జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో చర్మం సహజసిద్ధంగా కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. క్యారెట్లలో ఉండే విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు తగ్గిపోతాయి. క్యారెట్ జ్యూస్‌లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తుంది. ఈ జ్యూస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. ఫలితంగా గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

**క్యాన్సర్ రాకుండా..:** క్యారెట్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా కెరోటినాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. దీంతో పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. క్యారెట్ జ్యూస్‌ను ఉదయం సేవిస్తేనే అధిక ప్రయోజనం ఉంటుందని, ఆ సమయంలో క్యారెట్ జ్యూస్‌ను తాగితే అందులో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. క్యారెట్ జ్యూస్ ను ఉదయం తాగడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరిగి రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. క్యారెట్ జ్యూస్ తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అందులో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ఇలా క్యారెట్ జ్యూస్ ను రోజూ తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# భద్రత లేని బతుకులు

## 24 క్రాఫ్ట్ కార్మికుల జీవితాలు వర్ణనాతీతం



సినిమారంగంలో ఒక సినిమా బయటకు రావాలంటే వందలాదిమంది సమిష్టి కష్టం. కొన్ని లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్న అతి పెద్ద రంగం కూడా ఇదే. ఫలితం ఎలా ఉంటుందో తెలియకుండానే నిర్మాత వందలాది కోట్ల రూపాయలతో ఆడే ఒక రిస్కీగేమ్ ఈ సినిమా. ఒక సినిమా విడుదలవ్వాలంటే ఒక్కోసారి రెండు నుంచి మూడేళ్లపాటు రక్తాన్ని, చెమటను, అంతకుమించి హార్డ్‌వర్క్‌ని ధారపోయాల్సి వుం టుంది. ఆన్‌ది స్క్రీన్ హీరో శాసిస్తే, బిహైండ్ ది స్క్రీన్ డైరెక్టర్ శాసిస్తాడు. చలనచిత్రానికి సంబంధించి 24 శాఖలను సమన్వయ పరిచి సమర్ధవంతంగా ఆయాశాఖల నుంచితనకు కావాల్సిన విధంగా వారి సామర్థ్యాన్ని ఉపయోగించుకుని తన ఆలోచనలకు ప్రాణం పోసి తెరపైకి ఒక దృశ్యంగా మలచే వ్యక్తే దర్శకుడు. ఓ సినిమా హిట్ అవ్వాలన్నా, ఫ్లాప్ అవ్వాలన్నా అంతా ఆయన చేతిలోనే ఉంటుంది. ఒక సినిమా రూపొందాలంటే 24 విభాగాలు పనిచేయాలి. స్టంట్-దర్శకులు, స్టంట్ -ఆర్టిస్టులు.. గూస్ బంప్స్ వచ్చే పోరాట సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన సాహసాలు ఈ స్టంట్ మాస్టర్ల ఆధ్వర్యంలోనే జరుగుతాయి. వీరు తమ జీవితాలను సైతం ఫణంగా పెట్టి రిస్క్ సన్నివేశాలు చేస్తారు. ఈ కళకు శౌర్యం, దూకుడు తప్పనిసరి.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని: సినీ రంగంలో స్టంట్ మాస్టర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. సినిమా చిత్రీకరణల్లో స్టంట్స్ చేస్తున్నప్పుడు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కథానాయకులకు డూప్‌లుగా నటించేవారు స్టంట్‌లు చేస్తున్న సమయంలో ప్రమాదాలకు గురై మృత్యువాతపడుతుంటారు. దాదాపుగా అందరి కథానాయకులకు డూప్‌లు ఉంటుంటారు. షూటింగ్‌లో స్టంట్స్ చేస్తున్నప్పుడు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిరంతరం తీవ్ర ఒత్తిడి, తిరిగి ఇంటికి వెళ్తామో? లేదో? తెలియని ప్రమాదకరమైన స్టంట్‌లు చేసే స్టంట్ మాస్టర్లు, ఇతర సిబ్బందికి తగిన వేతనాలు లభించకపోవడం ఒక సమస్య. ప్రతిభావంతులైన స్టంట్ మాస్టర్లకు టాలీవుడ్‌లో కొదవలేదు. కానీ తగిన అవకాశాలు చాలామందికి తక్కువగానే లభిస్తున్నాయి. పనిచేసే వారిపై అధిక పని ఒత్తిడి కూడా ఉంటోంది. ప్రమాదాల్లో చనిపోవటం, గాయపడటం, కాలో, చేయి వంటివి విరిగిపోవటం వంటివి జరిగిన సమయంలో చిత్ర పరిశ్రమ ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా రక్షణ చర్యలు చేపట్టాలి.

ఆర్ట్ డైరెక్టర్ల అవస్థలు: డైరెక్టర్ సినిమాకి సంబంధించి ప్రాపర్టీస్ చూసుకుంటారు. దర్శకుడు అభిరుచులకు తగినట్లుగా బ్యాగ్రౌండ్‌లో ఉండాల్సిన అన్ని విషయాలను ఫైనలైజ్ చేసేది ఆర్ట్ విభాగం వారే. ఈ విభాగంలో కూడా ఎంతో మంది పనిచేస్తున్నారు. దర్శకుడి ఆలోచనలకు అనుగుణంగా సెట్లు వేసే సమయంలో బడ్జెట్ ఒక్కోసారి పెరగటం, ఇంకోసారి తగ్గటం జరుగుతుంటుంది. దీనికి ఆర్ట్ విభాగం వారని కించపర్చేలా నిర్మాతలు వ్యాఖ్యానాలు చేస్తుంటారు.

డ్యాన్సర్లకు అరకొర వేతనాలే: మిగతా కార్మికులతో పోలిస్తే డ్యాన్స్ విభాగంలో డ్యాన్సర్లకు నెలలో కేవలం 10 రోజులకు మించి పని ఉండదు. ఇచ్చే వేతనాలు కూడా అరకొరే. ఆన్‌స్క్రీన్‌లో కనిస్తామనే ఊహలో కొందరు తక్కువ పేమెంట్లకు కూడా పనిచేస్తుంటారు. ఇచ్చే మొత్తమే తక్కువ కాగా, రిహార్సల్స్ పేరుతో నాలుగైదు రోజులు సెట్లలోకి వచ్చి నిపుణత సాధించాల్సివుంటుంది. అప్పటికీ కొరియోగ్రాఫర్, నిర్మాత, దర్శకులకు నచ్చిన వారినే పనుల్లో పెట్టుకుంటుంటారు. మిగతా వారికి పనీ ఉండదు. పేమెంట్లు రావు.

ఆర్టిస్టుల అవస్థలు వర్ణనాతీతం: సినిమాల్లో నటీనటుల నటనను మనం ఎంతగా ఎంజాయ్ చేస్తామో.. వాళ్ళ వాయిసెస్‌కు కూడా మనం అలాగే మెస్మరైజ్ అవుతాం. వాళ్ళ నటన మనల్ని ఎంతలా ప్రభావితం చేసి.. వాళ్ళను గుర్తుంచుకునేలా చేస్తుందో వాళ్ళ గాత్రం కూడా మనపై అలాంటి ప్రభావమే చూపిస్తాయి. తన గాత్రాన్ని అరువు ఇచ్చే డబ్బింగ్ ఆర్టిస్టలకు కూడా కనీస వేతనాలు రావటం లేదు. చాలా సినిమాలకు పనిచేస్తున్నా పేమెంట్లు పెండింగ్ ఉంటున్నాయి. సినిమా షూటింగ్ ఫైనల్ అవుట్‌ఫుట్ విడుదలయ్యే వరకు దర్శకుడు సహా సినిమా యూనిట్ మొత్తం అనేక ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. వారిని గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లకు కూడా సరైన గుర్తింపు ఉండటం లేదు. కనీస వేతనాలు అమలు కావటం లేదు. మిగతా వారి కంటే డ్రైవర్లే ముందు బయలు దేరి వెళ్లి ఒక్కొక్కరినీ వాహనాల్లో ఎక్కించుకోవాలి. ప్రొడక్షన్ ఉమెన్ విభాగంలో మొత్తం మహిళలు మాత్రమే ఉంటారు. వీరు ప్రొడక్షన్ అసిస్టెంట్ల సూచనల మేరకు సినిమా సెట్ మొత్తాన్ని శుభ్రంగా ఉంచడం సహా సినిమాకు సంబంధించి ఇతరత్రా చిన్న పనులు చేసే వారికి కూడా అంతంతమాత్రంగా వేతనాలు అందుతున్నాయి. షఉట్ మొదలైన నుంచి పూర్తయ్యే వరకూ అన్ని పనులు చూసుకునేది ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌లే. నిర్మాతల ఆదేశాల మేరకు షఉటింగ్ పనులు, కార్లు పంపించడం, భోజన వసతి, షఉటింగ్ పూర్తయ్యాక వారి ప్రాంతాలకు చేరవేసే వరకూ అన్ని బాధ్యతలు చూసే వీరు కూడా ఇబ్బందులనే ఎదుర్కొంటున్నారు. సమయానికి పేమెంట్లు రాకపోవటంతో తనపరిధిలో పనిచేయించటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టెక్నికల్ స్కిల్స్ ఉన్నా సరే..!: పగలును రాత్రిగానూ, రాత్రిని పగలుగానే మార్చగలిగే లైటింగ్ కార్మికులు టెక్నిక్స్‌తో మ్యాజిక్ చేస్తూ ఉంటారు. అవసరానికి అనుగుణంగా వీరు లైటింగ్ ఫిక్స్ చేస్తూ ఉంటారు. కార్పెంటర్లు, పెయింటర్లు సెట్ తయారీదారులు స్టూడియో వర్కర్స్. వీరికి అంతంతమాత్రంగానే వేతనాలు అందుతున్నాయి. ప్రొడక్షన్ అసిస్టెంట్లుగా పనిచేసే వీరు సెట్ అసిస్టెంట్లుగా షూటింగ్ స్పాట్‌లో ఉండే అందరికీ ఆహార పదార్థాలు అందజేస్తూ ఉంటారు. కొందరు ఎగవేత పెడుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. షూటింగ్‌లో ముఖ్యపాత్ర పోషిస్తూ నటీనటులను అందంగా తయారు చేయాలన్నా, అందంగాఉన్న వ్యక్తిని డీగ్లామర్‌గామార్చేదివీళ్లే. నటుల ను పాత్రకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతున్నారు. వీరికీ అరకొర మొత్తాలే అందుతున్నాయి. దర్శకుడి అవసరానికి తగినట్లుగా నటీనటులకు దుస్తులను సిద్ధం చేసే కాస్ట్యూమ్ డిజైనర్లకు కూడా అరకొర వేతనాలు అందుతున్నాయి. ఆడియోగ్రాఫర్లు లవ్‌స్టోరీ, హారర్, థ్రిల్లర్, యాక్షన్-జోనర్ ఏదైనా సరే సన్నివేశాన్ని బట్టి సౌండ్ ఎఫెక్ట్స్‌ను సెట్ చేస్తుంటారు. ఇలా 24 క్రాఫ్ట్‌ల పరిధిలో పనిచేసే కార్మికులు గత అగ్రిమెంట్ మేరకు తమకు వేతనం 30 శాతం పెంచాలని కోరుతూ గత కొన్ని రోజులుగా పోరుబాట పట్టిన విషయం తెలిసిందే.

# ములుగు జిల్లాకు ఐటీ కంపెనీ..!

**వరంగల, తెలంగాణ దిశ:** ములుగును ఐటీ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రూ.6 కోట్లతో ఐదు అంతస్తుల అత్యాధునిక ఐటీ భవనాన్ని నిర్మించనున్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా టాస్క్ సెంటర్‌లో ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని కార్యకలాపాలు ప్రారంభించారు. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఐటీ విప్లవం సృష్టించి వేల సంఖ్యలో ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది.తెలంగాణ లోని వెనుకబడిన మన్యం జిల్లా ములుగును భవిష్యత్తులో ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. స్థానిక యువతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. జిల్లాలో పెద్ద ఐటీ కంపెనీలను ఆకర్షించేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ములుగు పట్టణ శివారులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.6 కోట్లతో అత్యాధునిక ఐటీ భవనం నిర్మించనున్నారు. ఈ ఐదు అంతస్తుల భవనం కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో అంతస్తులో ఒక్కో ఐటీ కంపెనీని ఏర్పాటు చేసి, వేల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఉన్న తరహాలోనే ఈ భవనంలో అన్ని రకాల వసతులు కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల మంజూరు కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ములుగులో ఇప్పటికే ఏర్పాటు చేసిన టాస్క్ ) సెంటర్‌లోయువతకు ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఐటీ కంపెనీల ప్రాజెక్టులకు అనుగుణంగా ఉండే కోర్సులపై దృష్టి సారించి యువతను సిద్ధం చేస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన వెంటనే ఇక్కడే ఉద్యోగాలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఐటీ కంపెనీలను ఆకర్షించేదిశగా తొలి అడుగు పడింది. ములుగులోని టాస్క్ సెంటర్ ఆవరణలో సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం చేసుకుని నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఉద్యోగులు, మేనేజర్ల గదులు, వెయిటింగ్ హాల్ వంటి సౌకర్యాలు కార్పొరేట్ స్థాయిలో కల్పించారు. త్వరలోనే మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ కంపెనీ సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ ప్రాంతమైన ములుగులో ఐటీ విప్లవం సృష్టించి చరిత్ర సృష్టించాలని ములుగు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

# గ్రామాల్లో మొదలైన స్థానిక సౌస్థల రాజకీయ అలజడి

**నర్సంపేట, తెలంగాణ దిశ :** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సౌస్థల షెడ్యూల్ వెలుపరుచునున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ అలజడి మొదలైంది.పార్టీల వారీగా కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నారు. మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తు,మెజారిటీగా స్థానాలు కైవసం చేసునుకునేందుకు కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఒకరిపై ఒక్కరు విమర్శలు చేసుకుంటున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 31జెడ్ పి లు,556 జెడ్ పి టి సి స్థానాలు,556 ఎం పి పి స్థానాలు,5773 ఎం పి టి సి స్థానాలు,12778 గ్రామపంచా యతీలు,112694 వార్డు సభ్యుల స్థానాలు ఖరారు చేయగా అందులో వరంగల్ జిల్లాలో జిల్లా చైర్మన్ 1,జెడ్ పి టి సి లు 11,ఎం పి పి లు 11ఎం పి టి సి లు 130,జి పి లు 317,వార్డ్ లు 2754 ఉన్నాయి.జిల్లా వ్యాప్తంగా రాజకీయ సమీకరనలు ఉపందుకున్నాయి.కాంగ్రెస్,బి ఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు నూతన మండల కమిటీలను ఎన్నుకున్నారు.మండలాల వారీగా కార్యకర్తలను సమాయాత్తం చేస్తూ ఎవరికివారు పార్టీ బలోపేతం కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు స్థానిక సౌస్థల్లో మెజారిటీ సీట్లు సాధించాలంటే 6 గ్యారంటీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పై ఇచ్చిన హామీలు అమలు కాలేదనే ప్రచారం ముందుకు తీసుకు పోవాలనే లక్ష్యంతో కార్యకర్తలకు సూచనలు ఇస్తున్నట్లు సమాచారం.అధికార కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు సాధించు కోవాలనే లక్ష్యంగా,10 సంవత్సరాలు బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉండి నిరుపేద ప్రజలకు ఒక్క ఇళ్లు కట్టించ లేదనే ప్రచారం ప్రజల్లో కి తీసుకు వెళ్లడంతో పాటు రాష్ట్రాన్ని అప్పుల ఉభిలోకి తీసుకు వెళ్లిందనే ప్రచారం చేయాలని,మేనిపెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటిల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత కరంటు,5 వందలకు గ్యాసు,రైతులకు 5 వందల బోనస్ రైతు రుణమాఫీ,మహిళలకు ఉచిత బస్సు,రాజీవ్ యువవికాసం, అమలు చేయబోయే మహాలక్ష్మి పథకాలను ప్రజల్లో కి తీసుకు పోవడంతో పాటు అర్హులైన నిరుపేదలకు ఉచిత సన్నాబియ్యం పంపిణి కార్యక్రమం జోరుగా ప్రచారం చేసి మెజారిటీ స్థానాలు సాధించు కోవాలని చూస్తున్నట్లు సమాచారం.అదేవిదంగా బిజెపి స్థానిక సౌస్థల్లో కొంత మేరకు మెజారిటి సాధించుకోవాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలనే విదంగా కార్యకర్తలకు సూచనలు ఇస్తున్నట్లు సమాచారం.వామాపక్షాల విషయానికి వస్తే ఎవరితోనైనా పొత్తు పెట్టుకుంటారా స్వాతంత్రంగా పోటీకి దిగుతారా అనేది వేచి చూడాల్సిందే..

## రాజీవ్ స్వగృహ టవర్ల సేల్



రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన టౌన్‌షిప్‌లలో అసంపూర్తిగా ఉన్న బహుళ అంతస్థుల భవనాల (3 టవర్లు) విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ. 70.11 కోట్ల ఆదాయం వచ్చింది. నగర శివార్లలోని పోచారం టౌన్‌షిప్‌లో రెండు టవర్లను, గాజుల రామారంలో ఒక టవర్‌ను బుధవారం లాటరీ ద్వారా అమ్మేశారు. కాగా, చదరపు అడుగుకు పోచారంలో రూ. 1,650, గాజుల రామారంలో రూ. 1,995గా ధరల్ని నిర్ణయించారు. ఇందులో భాగంగా పోచారంలో 72 ఫ్లాట్లతో ఉన్న ఓ టవర్‌ను ఎన్‌టీపీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు రూ. 13.78 కోట్లకు, 122 ఫ్లాట్లున్న మరో టవర్‌ను గాయత్రీ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ ట్రస్టుకు రూ. 30 కోట్లకు అమ్మేశారు. అలాగే గాజుల రామారంలోని 112 ఫ్లాట్లున్న టవర్‌ను ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు రూ. 26.33 కోట్లకు విక్రయించారు.

## ఎకరా రూ.70 కోట్లు... రూ.547 కోట్లకు 7.8 ఎకరాల్ని కొన్న గోద్రెజ్

హైదరాబాద్: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంపై గోద్రెజ్ కన్నేసింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)కు చెందిన 7.8 ఎకరాల భూమిని ఈ-వేలం ద్వారా విక్రయించగా, రూ. 547 కోట్లకు సదరు సంస్థ కొన్నది మరి. ఎకరం రూ. 70 కోట్లు పలకడం విశేషం. హౌజింగ్ బోర్డు బుధవారం చేపట్టిన వేలంలో గోద్రెజ్ ప్రాపర్టీస్‌తోపాటు అరబిందో రియల్టీ, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, అశోక బిల్డర్ వంటి ప్రముఖ నిర్మాణ రంగ సంస్థలు పోటీపడ్డాయి. ఈ క్రమంలోనే ఒక్కో ఎకరం రూ. 70 కోట్లకు గోద్రెజ్ సంస్థ కొనుగోలు చేసింది.
హైటెక్ సిటీకి సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పటికే అనేక సంస్థలకు చెందిన బహుళ అంతస్థుల భవనాలున్నాయి. ఈ లావాదేవీతో త్వరలో గోద్రెజ్ ఆధ్వర్యంలోనూ మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇక్కడ రానున్నది. కాగా, ఈ భూముల వేలానికి హౌసింగ్ బోర్డు గత నెలలోనే నోటిఫికేషన్ ఇచ్చింది. ఎకరాకు రూ. 40 కోట్లను కనీస ధరగా నిర్ణయించింది. దీంతో గోద్రెజ్ అత్యధిక ధరతో బిడ్ దాఖలు చేసినట్టు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం తెలిపారు.




# బీమాకు జీఎస్టీ ఊరట..!

న్యూఢిల్లీ,: త్వరలో వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమా పాలసీలకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మినహాయింపు దక్కనున్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రాలు జై కొడుతున్నట్టు బీహార్ ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య, జీవిత బీమాలపై ఏర్పాటైన రాష్ట్ర మంత్రుల బృందం (జీవోఎం) కన్వీనర్ సామ్రాట్ చౌధరి తెలిపారు. తెలంగాణ, ఏపీ సహా 13 రాష్ట్రాల మంత్రులు సభ్యులుగా ఉన్న ఈ జీవోఎం బుధవారం ఇక్కడ సమావేశమైంది. ఈ సందర్భంగానే సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన పలు అంశాలపై స్పష్టత ఇచ్చారు. కాగా, ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీల ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ పడుతున్న విషయం తెలిసిందే. అయితే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో వచ్చే నెలలో జరుగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోవచ్చని అంటున్నారు. 'ఈ ప్రతిపాదనకు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలు మద్దతు పలికాయి. అయితే జీఎస్టీ మినహాయింపు ప్రయోజనం.. కంపెనీలకుగాక, కస్టమర్లకే అందాలని, అందుకోసం ఓ యంత్రాంగాన్ని తేవాలని కోరాయి' అని జీవోఎంలో సభ్యత్వం ఉన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అయితే జీఎస్టీ కౌన్సిల్ ఈ అంశంపై ఓ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. కాగా, వ్యక్తిగత బీమా పాలసీలకు జీఎస్టీ మినహాయింపుతో ఏటా దాదాపు రూ. 9,700 కోట్ల ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య బీమా ప్రీమియంలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 8,262.94 కోట్ల జీఎస్టీని వసూలు చేశాయి. అలాగే హెల్త్ రీఇన్సూరెన్స్ ప్రీమియంలపై రూ. 1,484.36 కోట్లు వసూలు చేశాయి. ఇక జీఎస్టీ మండలికి జీవోఎం తమ నివేదికను ఈ ఏడాది అక్టోబర్ ఆఖరుకల్లా అందించాల్సి ఉన్నది. ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, ఆందోళనల్నీ ఈ నివేదికలో పొందుపర్చినట్టు సామ్రాట్ చౌధరి తెలిపారు. ఇదిలావుంటే పంద్రాగస్టు రోజున కేంద్రం ప్రకటించిన తర్వాతి తరం జీఎస్టీ సంస్కరణల్లో భాగంగానే ఆరోగ్య, జీవిత బీమా పాలసీల ప్రీమియంలపై జీఎస్టీ ఎత్తివేత ప్రతిపాదన అని చెప్తున్నారు. ఇప్పటికే జీఎస్టీ స్లాబులను 4 నుంచి 2కు తగ్గించాలని కేంద్రం ప్రతిపాదించిన సంగతి విదితమే. ప్రస్తుతమున్న 5, 12, 18, 28 శాతం స్లాబుల్లో 12 శాతం స్లాబులోని 99 శాతం వస్తూత్పత్తులను 5 శాతం స్లాబులోకి, 28 శాతం స్లాబులోని 90 శాతం వస్తూత్పత్తులను 18 శాతం స్లాబులోకి మార్చి ఆయా (12, 28) స్లాబులను తొలగించాలని చూస్తున్నారు. మిగిలేవి 5 శాతం, 18 శాతం స్లాబులే. మెరిట్, స్టాండర్డ్ ఆధారంగా వస్తూత్పత్తులను వర్గీకరించబోతున్నారు. పొగాకు ఉత్పత్తులు, లగ్జరీ కార్లు, బైకులు తదితరాలపై 40 శాతం జీఎస్టీ ఉంటుంది. వీటన్నిటిపై చర్చించేందుకే తాజా జీవోఎం భేటీ జరిగింది. జీఎస్టీ విధానంలో తమ ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న సంస్కరణల్ని జీవోఎంకు ఆర్థిక మంత్రి నిర్మల తాజా సమావేశంలో వివరించారు. ఈ అంశంపై రాష్ట్రాలను ఒక్క తాటిపైకి తెచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నది. ఇదిలావుంటే నష్టపరిహార సెస్సుపైనా జీవోఎం ప్రధానంగా దృష్టి పెట్టింది. కేంద్ర, రాష్ట్రాల పన్నులను కలిపి 2017 జూలై 1న దేశవ్యాప్తంగా జీఎస్టీని అమల్లోకి తెచ్చినది తెలిసిందే. అయితే జీఎస్టీతో రాష్ట్రాలకు వాటిల్లుతున్న రెవిన్యూ నష్టాల భర్తీకి నష్టపరిహార సెస్సును విధించారు. తొలుత ఐదేండ్లనుకున్నా కరోనాతో మారిన పరిస్థితుల దృష్ట్యా వచ్చే మార్చి 31దాకా




పొడిగించారు. కరోనాతో జీఎస్టీ ఆదాయం పడిపోయిందని, అయినప్పటికీ రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉన్నందున.. అప్పులు చేసి కడుతున్నామని, వాటిని తీర్చేందుకే నష్టపరిహార సెస్సు అమలును పెంచామని మోదీ సర్కారు చెప్తున్నది. ఈ నేపథ్యంలో గడువు దాటిన తర్వాత సెస్సు సంగతి ఏంటన్నదానిపై ఈ మేరకు ఏర్పాటైన జీవోఎం చర్చిస్తున్నట్టు సమాచారం. అయితే మరో రెండేండ్లు పొడిగించవచ్చన్న అంచనాలున్నాయి. కానీ రికార్డు స్థాయిలో నెలవారీ జీఎస్టీ వసూళ్లు నమోదవుతున్న దృష్ట్యా ఈ ఊహాగానాలకు ప్రాధాన్యత ఏర్పడుతున్నదిప్పుడు.


## 3 సంవత్సరాల ఎఫ్డీ పై అత్యధిక రాబడిని ఇస్తున్న పెద్ద బ్యాంకులు




ప్రస్తుత రోజుల్లో ఆర్థిక క్రమశిక్షణ పెరుగుతోంది. ఆచితూచి ఖర్చు చేస్తూ పొదుపుకు ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. సేవ్ చేసిన డబ్బును పెట్టుబడి పెట్టేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అయితే ఇన్వెస్ట్ చేసేందుకు అనేక మార్గాలున్నాయి. స్టాక్ మార్కెట్స్, ఈటీఎఫ్, మ్యూచువల్ ఫండ్స్ చాలా ఆప్షన్స్ ఉన్నాయి. కానీ ప్రజలు ఇప్పటికీ బ్యాంక్ ఎఫీని ఎక్కువగా విశ్వసిస్తారు. బ్యాంక్ ఎఫ్డీలో గ్యారంటీ రాబడి లభిస్తుంది. 3సంవత్సరాల ఎఫ్డీ పై అత్యధిక రాబడిని ఇస్తున్న పెద్ద బ్యాంకులు ఏవో ఇప్పుడు చూద్దాం. పైసా బజార్ వెబ్‌సైట్ ఆధారంగా ఈ జాబితాలో ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకులు ఉన్నాయి. ఈ జాబితా ప్రకారం, పెద్ద ప్రభుత్వ బ్యాంకులలో, యాక్సిస్ బ్యాంక్ 3 సంవత్సరాల FDపై అత్యధిక రాబడిని ఇస్తోంది. యాక్సిస్ బ్యాంక్ 3 సంవత్సరాలపై 6.50 శాతం రాబడిని అందిస్తోంది. ప్రైవేట్ బ్యాంకులలో, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధిక రాబడిని ఇస్తోంది. ఇది 3 సంవత్సరాల FDపె6.50% రాబడిని అందిస్తోంది. దీనితో పాటు, వం టి ప్రముఖ బ్యాంకులు 3 సంవత్సరాల FD పై 6.60%, HDFC 6.45% అందిస్తున్నాయి. అదేవిధంగా,పెద్ద ప్రభుత్వ బ్యాంకులు 6.30%, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 6.40% అందిస్తున్నాయి.

## ఆన్‌లైన్ గేమింగ్‌తో భారీ నష్టం..

న్యూఢిల్లీ,: ఆన్‌లైన్ రియల్ మనీ గేమింగ్‌తో ప్రజలు భారీగా నష్టపోతున్నారు. ప్రతీయేటా 45 కోట్ల మంది భారతీయులు సుమారు రూ. 20 వేల కోట్ల మేర నష్టపోవచ్చునని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆన్‌లైన్‌రియల్ మనీ గేమింగ్ సమాజానికి ఒక పెద్ద సమస్యగా తయారైందని ప్రభుత్వం గుర్తించిందని, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయాలనేఉద్దేశంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించాలనే ఉద్దేశంతో రూపొందించిన ప్రత్యేక బిల్లును లోక్‌సభలో నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ గేమింగ్ మనీ ఒక పెద్ద సమస్యగా తయారైందని, ప్రతీ పార్లమెంట్ సభ్యుడు దీనిపైఆందోళన వ్యక్తం చేస్తున్నారని,పరిశ్రమ విభాగం నుంచి వచ్చే ఆదాయంలో మూడింట ఒకవంతు సంక్షేమానికి కేటాయిస్తున్నదన్నారు. నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించి ఆన్‌లైన్ మనీ గేమింగ్ సేవలు ఎవరైనా అందిస్తే వారికి మూడేండ్ల వరకు జైలు శిక్ష లేదా కోటి రూపాయల వరకు జరిమానా, లేదా రెండూ విధించవచ్చునని బిల్లు ప్రతిపాదించింది.



# రోగ నిరోధకతను పెంచే ఆహారమే మేలు



వేసవిలో ఎండ వేడి తగలకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నామో.. వర్షాకాలంలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. వర్షాకాలంలో చిటపట చినుకుల మధ్య వేడివేడిగా ఏమైనా చిరుతిళ్లు తినాలనిపిస్తుంది. కానీ.. శరీరానికి పోషకాలు అందించే, రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం, పండ్లు తినడం ఉత్తమం. పైగా ఇది సీజన్ మారటంతో జ్వరం, జలుబు, అలర్జీ, ఇన్‌ఫెక్షన్, అజీర్ణ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. వీటినుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే శరీరానికి శక్తి అవసరం. వ్యాధినిరోధక శక్తి అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో మన ఆరోగ్యానికి ఎంతో అవసరం కూడా. అందుకు తినాల్సిన పండ్ల గురించి తెలుసుకుందాం. నేరేడు: సీజనల్‌గా వర్షాకాలంలో నేరేడు పండ్లు విరివిగా లభిస్తున్నాయి. వీటిలో కేలరీలు తక్కువ. ఇనుము, ఫోలేట్, పొటాషి యం, విటమిన్లు ఎక్కువగా ఉండటంతో బరువు తగ్గాలనుకునే వారికి ఇవి మంచి చాయిస్. అజీర్తిని తగ్గిస్తాయి కూడా. చెర్రీస్ : వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే పండ్లలో చెర్రీస్ ఒకటి. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగాఉండే పండ్లు ఇవి. మెదడుపై ఒత్తిడి తగ్గించి ప్రశాంతతకలిగేలా చేస్తాయి. ఇన్‌ఫెక్షన్లనుంచి కాపాడుతుంది. అరటిపండ్లు : విటమిన్స్ ఎక్కువగా ఉండే అరటిపండు ఎంతో ఆరోగ్యం. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్తి సమస్యలను పోగొడుతుంది. పిల్లలకు అరటిపండ్లు చాలా మంచివి. రోజుకో పండైనా తినిపించాలి. దీంతో శరీరానికి శక్తి లభిస్తుంది.
యాపిల్ :వర్షాకాలానికి తగ్గట్టు శరీరంలోయాక్టివ్ నెస్ కాస్త నెమ్మదిస్తుంది. దీంతో శరీరంలో జరిగే జీవక్రియ వేగం కూడా తక్కువగా ఉంటుంది. వీటిని అధిగమించేందుకు యాపిల్ పండు ఉత్తమం.
రేగు : వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. ఫ్లూ, జలుబు వంటి ఇన్ ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది.
దానిమ్మ: ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. రక్తం పడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకూ రోజకొక పండైనా తింటే ఆరోగ్యంగా ఉంటారు.
బొప్పాయి : విటమిన్ 'సి' అధికంగా లబించే పండు బొప్పాయి. ఆరోగ్యానికి ఎంతో మంచిది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. ఇందులో పీచు పదార్థం ఎక్కువ. కాస్త మితంగా తీసుకోవడం ఉత్తమం. పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..: తగినంతగా నీరు (హైడ్రేషన్) : వర్షాకాలంలో తగినంత నీరు త్రాగాలి. తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పటికీ శరీరానికి నీరు అవసరం. వర్షం వల్ల వచ్చే అధిక తేమ కారణంగా డీహైడ్రేట్‌కు కారణం అవుతుంది. రోజూ కనీసం ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగడం ద్వారా హైడ్రేట్‌గా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు.
కషాయాలు, డ్రింక్స్: వర్షాకాలంలో అల్లం, హెర్బల్ టీలు, సూప్‌లు తాగాలి. ఇవి శరీరాన్ని వెచ్చగా ఉంచుతాయి. అంతేకాకుండా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. గ్రీన్ టీ, చమోమిలే హెర్బల్ టీలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
సీజనల్ ఫ్రూట్స్: సీజన్‌లో లభించే పండ్లను తినాలి. యాపిల్స్, బేరి, దానిమ్మ, నారింజ పళ్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పండ్లు ఆరోగ్యకరమైన రోగ నిరోధక వ్యవస్థను పెంచుతాయి. ఇన్‌ఫెక్షన్లను నిరోధిస్తాయి.
విటమిన్ సి: రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహారంలో విటమిన్ సి ఉండే ఆహారాన్ని తినాలి. నిమ్మకాయలు, నారింజ పండ్లు, ద్రాక్ష పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. బ్రకోలీ, బెల్ పెప్పర్స్, కివీస్‌లో కూడా విటమిన్ సి సమద్ధిగా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధుల నుంచి కాపాడుతాయి.
సమతుల భోజనం : వర్షాకాలంలో తేలికపాటి, సమతుల ఆహారం తీసుకోవాలి. లీన్ ప్రోటీన్స్, తణధాన్యాలు కలిసి ఉండే భోజనాన్ని తినాలి. వోట్స్, క్వినోవా, బ్రౌన్ రైస్ వంటివి తినాలి. చికెన్, చేపలు, టోఫు వంటి లీన్ ప్రోటీన్స్ ద్వారా కండరాలు పెరుగుతాయి. కూరగాయలలో ఉండే ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
ఉల్లిపాయలు, వెల్లుల్లి : వెల్లుల్లి, ఉల్లిపాయలు సహజంగా యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా, వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల నుంచి ఇవి రక్షిస్తాయి.
స్ట్రీట్‌ఫుడ్స్ వద్దు : వర్షాకాలంలో బయటి ఫుడ్స్ తినకుండా ఉండటం మేలు చేస్తుంది. వాతావరణ మార్పుల కారణంగా బయటి ఫుడ్స్ ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయి.
కలుషిత ఆహారాన్ని తినొద్దు: మనం తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. శరీరానికి సరైన పోషకాలు అందించకపోతే చాలా రకాల ఇబ్బందులు తలెత్తుతాయి. ఏటేటా ప్రపంచ వ్యాప్తంగా కలుషిత ఆహారం సమస్య తీవ్రమవుతోంది. ప్రపంచ జనాభాను కలుషిత ఆహారం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మన దేశంలో 527 రకాల ఆహారాలు కలుషితం అవుతున్నాయని వివిధ నివేదికలు పేర్కొంటున్నాయి. అసలు ఆహారం కలుషితం అంటే ఏమిటి? ఎన్ని రకాలు? తీసుకోవాల్సిన నివారణ చర్యలేమిలో తెలుసుకుందాం..
ఆహారం ఎలా కలుషితం అవుతుందంటే...: ఆహార ఉత్పత్తుల్లోకి బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు, రసాయనాలు లేదా టాక్సిన్లు వంటి హానికరమైన పదార్థాలు,జీవులు ప్రవేశిస్తే అవి కలుషితమవుతాయి. ప్రాసెసింగ్, రవాణా, స్టోరేజ్ వంటి ఏదో ఒక దశలో ఆహార ఉత్పత్తులు కలుషితం అవుతున్నాయి. మనదేశంలో కలుషితమవుతున్న ఆహారాల జాబితాలో ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాల ఉత్పత్తులు, మాంసం, సుగంధ ద్రవ్యాలు, ప్యాక్డ్ స్నాక్స్ వంటివి ఉన్నాయి. ఈ ఆహారాలు వివిధ రోగ కారకాలు లేదా రసాయనాలతో కలుషితం కావొచ్చు. వీటిని ఆహారంగా తీసుకుంటే రోగాల తీవ్రత పెరుగుతుంది.
పరిశుభ్రత పాటించకపోవటమే కారణం: ఆహారం కలుషితం కావటానికి అనేక కారణాలున్నాయి. పారిశుధ్యం లేకపోవటం, సరైన పరిశుభ్రత పద్ధతులు పాటించకపోవటం, ఫుడ్ ప్రాసెసింగ్ సరిగ్గా చేయకపోవటం, నిల్వ, రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోకపో వటం కూడా ప్రధాన కారణాలే. అలాగే పురుగు మందుల అధిక వినియోగం వల్ల కూడా ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయి.

# ఆమె ధిక్కారం.. గొప్ప మార్పుకు ఆరంభం





అమ్మాయి 'వద్దు అందంటే వద్దనే' అర్థం.. అని కచ్చితంగా, కరాఖండిగా చెబుతున్న కాలం ఇది. కానీ, 19వ శతాబ్దంలో అమ్మాయి పరిస్థితి అలా లేదు. వివాహం ఆమె ఎంపిక కాదు. అది ఓ శాసనం. నిండా పదేళ్లు కూడా లేకుండా ఆడపిల్లకి పెళ్లి చేయడం అప్పుడు ఆనవాయితీ. సామాజిక కట్టుబాట్లకి లొంగిపోయిన ఎందరో ఆడపిల్లలు పట్టుమని ఇరవై ఏళ్లు కూడా నిండకుండా రెండు, మూడు గర్భస్రావాలతో, అరడజను మందికి పైగా పిల్లల తల్లులు. ఇంకా ఇలాంటి ఘోరాలు అప్పట్లో ఎన్నో.. ఆ పరిస్థితులని ధిక్కరించడం ఏ అమ్మాయి కలలో కూడా ఊహించని పరిణామం. కానీ, రుక్మాబాయి రౌత్ ఆ పనిచేసింది. బాల్యంలో తనకి జరిగిన వివాహాన్ని రద్దు చేయమని కోర్టుని ఆశ్రయించింది. 'జైలుకైనా వెళతా కాని భర్తతో కాపురానికి వెళ్లన'ని కరాఖండిగా చెప్పింది. ఈ సాహసం చేసినందుకు సమాజం ఆమెని ఎంతో అవమానించింది. అంతకుమించి నిందలు మోపింది. అయినా రుక్మా తన నిర్ణయాన్ని విడిచిపెట్టలేదు. పోరాడింది. సాధించింది. అలా భారత్‌లో తొలి విడాకులు తీసుకున్న మహిళగా చరిత్రల్లో తన పేరుని శాశ్వతంగా లిఖించుకుంది. ఆ రోజు ఆమె తీసుకున్న ఆ నిర్ణయం వెనుక తన ప్రయోజనం కంటే సమాజాన్ని బాగు చేయాలనుకున్న తపనే కనిపిస్తుంది. సెప్టెంబరు 25న ఆమె వర్ధంతి. రుక్మాబాయి పుట్టేనాటికి ఆమె తల్లి వయసు 15 ఏళ్లు. 1864 జయంతి బాయి, జనార్ధన్ పాండురంగ్ దంపతులకు ఆమె జన్మించింది. రుక్మాకి రెండేళ్లు వచ్చేసరికి తండ్రి చనిపోయాడు. ఆమెకి 8 ఏళ్లప్పుడు తల్లి జయంతిని ప్రముఖ వైద్యుడూ, వృక్ష శాస్త్రవేత్త, సంఘసంస్కర్త అయిన డా. సఖరాం అర్జున్ రెండో వివాహం చేసుకున్నారు. వితంతు వివాహం ద్వారా గొప్ప మార్పుని స్వాగతించిన సఖరాం, జయంతి బిడ్డ అయిన రుక్మాని బాల్య వివాహం నుంచి తప్పించలేకపోయారు.

రుక్మాకి 11 ఏళ్లువచ్చేసరికి తనకంటే 8 ఏళ్లు పెద్దవాడైన దాదాజీ భికాజీతో వివాహం చేశారు. యుక్తవయసు వచ్చిన తరువాతే అత్తింటికి వెళ్లేలా ఒప్పందం పెట్టుకున్నారు. సవితి తండ్రి సఖరాం చొరవతో రుక్మా చదువులో రాణించింది. కానీ, భికాజీ చెడు సావాసాలకు అలవాటు పడ్డాడు. రజస్వల అయిన రుక్మాని కాపురానికి పంపమని ఒత్తిడి చేశాడు. కానీ రుక్మా ససేమిరా అంది. ఆ ధిక్కరణ అప్పట్లో పెద్ద విప్లవం. భర్త ఆజ్ఞాపిస్తే భార్య కాదనడం బరితెగించడం. ఈ ధోరణిని నిరసిస్తూ భికాజీ కోర్టు ద్వారా భార్యని లొంగదీసుకోవాలిని చూశాడు. అయినా రుక్మా భయపడలేదు.

1885లో రుక్మా వర్సెస్ భికాజీ కేసు బొంబాయి హైకోర్టుకి వచ్చింది. ఆమె భర్తతో ఇంటికి వెళ్లాలని, లేనిపక్షంలో జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వచ్చింది. అప్పుడు తాను 'జైలుకైనా వెళతా కానీ, భికాజీతో వెళ్లే ప్రసక్తి లేద'ని రుక్మా గట్టిగా నిలబడింది. ఆ రోజుల్లో ఆ నిర్ణయం తీసుకోవాలంటే ఎంతో ధైర్యం ఉండాలి. మహిళలు కన్నెత్తి చూడడానికి, పన్నెత్తి మాట్లాడానికి వీలు కాని ఆ సమాజంలో రుక్మా తీసుకున్న నిర్ణయం పత్రికల్లో పతాక శీర్షికన అచ్చయ్యింది. సంస్కర్తలు రుక్మా వైపు నిలబడ్డారు. సనాతన వాదులు తమ వాదనలతో రుక్మాని భయంకరంగా నిందించారు. 'చదువుకున్నందుకే రుక్మా ఇలా మాట్లాడుతోంది. అందుకే ఆడపిల్లలకు చదువు వద్దనేది' అని నీచమైన వాదనలు ముందుకు తెచ్చారు.

హిందూ వివాహచట్టం, బ్రిటీష్ లా అంటూ రుక్మా విడాకుల కేసు కొన్నేళ్లపాటు కోర్టు గదుల్లో నలిగింది. రుక్మాని దారికి తెచ్చుకోవడానికి భికాజీ ఎన్నో ఎత్తుగడలు వేశాడు. తన ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా అడుగడుగునా ఎన్నో ప్రతిబంధకాలు సృష్టించాడు. అప్పుడే రుక్మా ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. బ్రిటన్ రాణి క్వీన్ విక్టోరియాకి తన పరిస్థితిని తెలియజేస్తూ సుదీర్ఘ లేఖ రాసింది. దేశంలో ఆడపిల్లల పట్ల సమాజం వ్యవహరిస్తున్న తీరుని ఆ లేఖలో ఎండగట్టింది.

బాల్యవివాహాలు అమ్మాయిల శరీరాలని, మనసులని ఎంతలా ఛిద్రం చేస్తున్నాయో సోదాహరణంగా వివరించింది. ఆడపిల్లల భవిష్యత్తుకి, విద్యకి ఆ వివాహాలు ఎంత ప్రతిబంధకంగా నిలుస్తున్నాయో చెప్పింది. రుక్మా చేసిన ఈ సాహసం, ఆ తరువాత ఆమె ఒక్కత్తికే కాదు, ఎందరో ఆడపిల్లల జీవితాల్లో మార్పుకు నాంది పలికింది. రుక్మా కేసు కోర్టులో ఉన్నప్పుడు 'ఎ హిందూ గర్ల్' పేరుతో ప్రముఖ వార్తా పత్రికలో ఆమె ఉత్తరాలు రాసింది. బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేంత శక్తివంతంగా వాటిని సిద్ధం చేసింది. ఆమె ప్రస్తావించిన రెండు, మూడు వాక్యాలను చదివితే ఆనాటి ఆడపిల్లల దుర్భర పరిస్థితులు అర్థమవుతాయి. 'ఈ వివాహాలతో మేము చదువు విలువ తెలుసుకునే సమయానికి బడి మానేస్తున్నాం. పద్నాలుగో ఏడు రాకముందే తల్లులం అవుతున్నాం. చదువుకోవాలన్న తపన ఉన్న ఎంతోమంది ఆడపిల్లలని ఈ సాంప్రదాయం జీవచ్ఛవాలుగా చేస్తోంది. అలాంటి ఎందరో ఆడపిల్లల్లో నేను ఒకదాన్ని. ఈ దురాచారం నా జీవితంలోని అన్ని సంతోషాలని సర్వనాశనం చేసింది. ఇంకా ఇది నా జీవితంలో అన్నింటి కంటే ముఖ్యమనుకున్న విద్యని దూరం చేసేందుకు ప్రయత్నించింది. కాబట్టి పెళ్లి చేసుకునే ఆడపిల్లల కనీస వయసుని పెంచమ'ని ఆ లేఖల్లో సూచించింది. ఈ వ్యాఖ్యలు సమాజంలో పెద్ద చర్చకి తెరతీశాయి.

1891లో 'ఏజ్ ఆఫ్ కన్సెంట్' చట్టం వచ్చేందుకు రుక్మా కేసు దారితీసింది. వివాహం చేసుకునే అమ్మాయి కనీస వయసుని పెంచుతూ ఆ చట్టం తెచ్చారు. ఇది రుక్మా సాధించిన అసామాన్య విజయం. ఎందరో ఆడపిల్లలకు గొప్ప వరంగా మారిన అవకాశం. రుక్మా గురించి ఇక్కడివరకే తెలుసుకుంటే సరిపోదు. ఆ తరువాత ఆమె సాగించిన జీవితం కూడా ఎంతో ఆదర్శప్రాయం. విద్యలో రాణించిన రుక్మా వైద్య విద్య అభ్యసించేందుకు లండన్ వెళ్లింది. 1893లో డాక్టర్‌గా భారత్‌లో తన ప్రయాణం మొదలుపెట్టింది. దశాబ్దాలపాటు వైద్య సేవలు అందించింది. రిటైర్డ్ అయ్యేనాటికి సూరత్ మహిళా ఆస్పత్రికి చీఫ్ మెడికల్ ఆఫీసర్ బాధ్యతలు నిర్వర్తించింది. మహిళలు నాలుగ్గోడల మధ్య నలిగిపోయే మర మనుషులు కాదని, సైన్స్, వైద్య ప్రపంచంలో నిర్విరామంగా సేవలు అందించే సత్తా కలవారిని నిరూపించిన తొలితరం మహిళా వైద్యుల్లో ఒకరిగా రుక్మాని ఈ చరిత్ర గుర్తుంచు కోవాలి. రుక్మా ధిక్కారం.. సమాజాన్ని ముందుకు నడిపించిన గొప్ప మార్పు. ముంబయి కోర్టు నుంచి లండన్ రాణి టేబుల్ వరకు తీసుకెళ్లిన సాహసం.

## కాంగ్రెస్ రాష్ట్రాల నుంచి వెనక్కి వెళ్లిపోతున్న కంపెనీలు

### తెలంగాణ నుంచి ఎల్ అండ్ టీ, కర్ణాటక నుంచి బ్లాక్ బక్

**హైదరాబాద్, తెలంగాణ దిశ:** ఒకప్పటి రోజులు కావు ఇవి. ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించే రోజులు కావు ఇవి. మొత్తంగా చూస్తే ప్రైవేట్ కంపెనీలే చాలావరకు ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఉపాధి కల్పిస్తున్నాయి. ఇక ఐటీ విస్ఫోటనం వల్ల చాలా వరకు కార్పొరేట్ కంపెనీలు అన్ని దేశాల యువతకు ఉపాధిని చూపిస్తున్నాయి. ప్రభుత్వాలు ఉద్యోగ కల్పన అనే విషయాన్ని పక్కన పెట్టి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నాయి. రాయితీలు ఇస్తూ.. భూములను కట్టబెడుతూ.. రకరకాల సౌకర్యాలు కల్పిస్తూ తరిస్తున్నాయి. అమెరికా నుంచి ఇండియా వరకు ఇదే పరిస్థితి.కార్పొరేట్ కంపెనీలు అన్ని వసతులు చూసుకున్న తర్వాతే కార్యకలాపాలు మొదలు పెడతాయి. రోడ్లు, విద్యుత్తు, నీటి సరఫరా, మౌలిక వసతులు చూసుకున్న తర్వాతే ఉత్పత్తి ప్రారంభిస్తాయి. ఇందులో ఏది తేడా ఉన్నా సరే కంపెనీలు వెళ్ళిపోతుంటాయి. ఒక కంపెనీ ఒక ప్రాంతం నుంచి వెళ్ళిపోయింది అంటే అక్కడ అనేక రకాల సమస్యలు ఉన్నట్టు లెక్క. ఉదాహరణకు పాకిస్థాన్ నుంచి మైక్రోసాఫ్ట్ వెళ్లిపోయింది అంటే.. అక్కడ రాజకీయ పరిస్థితులు ప్రధాన కారణం. ఒక కంపెనీ వెళ్లిపోతే ఆ ప్రాంతం మీద తీవ్రస్థాయిలో ప్రభావం పడుతుంది. ఆర్థికపరంగా, సామాజికపరంగా ఇబ్బంది ఎదురవుతుంది.కర్ణాటక రాష్ట్రంలో ప్రస్తుతం బ్లాక్ బక్ అనే కంపెనీ వెళ్ళిపోతోంది. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నగరంలో రోడ్లు గుంతలు గుంతలుగా ఉండడంతో తట్టుకోలేక తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ కంపెనీ ప్రకటించినట్టు వార్తలు వస్తున్నాయి.. కేవలం ఈ కంపెనీ మాత్రమే కాదు.. చాలా కంపెనీలు బెంగళూరు నగరంలో ని రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఇదే బాటలో ఉన్నట్టు తెలుస్తోంది. అరగంట ప్రయాణానికి రెండు గంటల వరకు సమయం పడుతూ ఉండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల గుంతల వల్ల అక్షరాల ప్రతి ఏడాదికి 20వేల కోట్ల నష్టం వాటిల్లుతోందని తెలుస్తోంది. ఇక వర్షం కురిస్తే రోడ్డుమీద వెళ్లడం కంటే లైఫ్ బోట్లలో ప్రయాణించడం ఉత్తమం అని అక్కడి ఉద్యోగులు భావిస్తున్నారట. పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నప్పటికీ బెంగళూరు డెవలప్మెంట్ అథారిటీ నిశ్శబ్దంగా ఉంటున్నదట.. దీంతో అన్ని కంపెనీలు బాబోయ్ మాకొద్దీ ఇండియన్ సిలికాన్ వ్యాలీ అనుకుంటూ వెళ్లిపోతున్నారట. ఇదే క్రమంలో ఆ కంపెనీలను మిగతా ప్రభుత్వాలు ఆహ్వానిస్తున్నా యట. ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలుకుతున్నాయట.తెలంగాణ రాష్ట్రంలో మెట్రో కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని ఇప్పటికే ఎల్ అండ్ టి భావించింది. దీనికి సంబంధించి ప్రభుత్వానికి ఒక వర్తమా నం కూడా పంపిందని వార్తలు వస్తున్నాయి. ఎల్ అండ్ టి కంపెనీని వసూళ్ల కోసం వేధించడం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఇప్పటికే గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. దీనికి తగ్గట్టుగానే మెట్రో రెండవ దశలో ఎల్ అండ్ టీ ని ప్రభుత్వం పక్కన పెట్టింది. పైకి ఆస్తులు నిర్వహణ.. ఇతర విషయాలలో ఎల్ అండ్ టీ వ్యవహార శైలి బాగోలేదని ప్రభుత్వం ఆరోపిస్తోంది. కానీ తెరపైకి మాత్రం వసూళ్ల వ్యవహారమే కారణమని తెలుస్తోంది. ఇది ఏమైనప్పటికీ దక్షిణాది రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణలో రెండు కార్పొరేట్ కంపెనీలు బయటికి వెళ్లిపోవడం నిజంగానే ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా ఓటు చోరీ అంటూ.. ప్రభుత్వ మారాలంటూ ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీకి ఈ పరిణామాలు ఒకరకంగా గుదిబండలే.

# ఐఫోన్ 17 కోసం బారులు




బెంగళూరు, : ఆపిల్ ఐఫోన్ 17 సిరీస్ ఇండియాలో అధికారికంగా అందుబాటులోకి వచ్చింది. సెప్టెంబర్ 19, 2025న ముంబై బంద్రా?కుర్లా కాంప్లెక్స్ యాపిల్ స్టోర్ వద్ద అందుబాటులోకి వచ్చింది. అయితే ఫోన్ కోసం రాత్రి నుంచి లైన్లు పడుకున్న ఫ్యాన్స్ మధ్య ఉత్తేజం ఆకస్మిక కొట్టుకోవడాలుగా మారింది. సెక్యూరిటీ సిబ్బంది జోక్యం చేసుకోవలసి వచ్చింది. ఈ షాకింగ్ ఘటనలు సోషల్ మీడియాలో వీడియోల రూపంలో వైరల్ అవుతున్నాయి. ఇండియన్ ఐఫోన్ మార్కెట్ ప్రీమియం డిమాండ్‌ను మరింత హైలైట్ చేస్తున్నాయి.ఆపిల్ సెప్టెంబర్ 9న ప్రకటించిన ఐఫోన్ 17 సిరీస్‌లో ఐఫోన్ 17,ఐఫోన్17 ప్రో, ఐఫోన్ 17 ప్రో ఓజీలీ, కొత్త ఐఫోన్ ఎతీతీ మోడల్స్ ఉన్నాయి. ఇండియాలో ధరలు రూ.82,900 నుంచి రూ.2,29,900 వరకు ఉన్నాయి, ఇది మునుపటి మోడల్స్‌తో సమానంగా ఉంది. కీ ఫీచర్లలో అధునాతన ఏఐ ఇంటిగ్రేషన్, మెరుగైన కెమెరాలు, లాంగ్?లాస్టింగ్ బ్యాటరీలు, కాస్మిక్ ఆరెంజ్ వంటి కొత్త కలర్ ఆప్షన్లు ఉన్నాయి. ఇండియాలో ప్రీ?ఆర్డర్లు రికార్డ్ స్థాయిలో జరిగాయి, ముఖ్యంగా ప్రోట మోడల్స్ కొత్త కలర్‌లు త్వరగా స్టాక్ అవుట్ అయ్యాయి. ఈ లాంచ్ ఇండియాలో ఆపిల్‌కు మరో మైలురాయి. ఢిల్లీ సాకెట్, ముంబై బీకేసీ, బెంగళూరు స్టోర్ల వద్ద రాత్రి 3 గంటల నుంచి క్యూలు పడ్డాయి. ముంబై బీకేసీ స్టోర్ వద్ద రాత్రి నుంచి లైన్లు ఏర్పడటం, అహ్మదాబాద్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కస్టమర్లు క్యాంప్ చేయడం ఆపిల్ ఫోన్లపై భారతీయుల పిచ్చికి అద్దం పడుతున్నాయి.ఉదయం 5 గంటలకు ముంబై బీకేసీ జియో వరల్డ్ డ్రైవ్ స్టోర్ వద్ద వందలాది మంది క్యూలో నిలిచారు. స్టోర్ తెరవగానే ఉత్సాహం ఎక్కువ కావడంతో కొంతమంది మధ్య గొడవ మొదలై అది క్రమంగా కొట్టుకునే వరకు వెళ్లింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే జోక్యం చేసుకుని, లైన్లను కట్టుబడి నిర్వహించారు. ఢిల్లీ సాకెట్ స్టోర్ వద్ద కూడా భారీగా ఐఫోన్ లవర్స్ బారులు తీరారు. కానీ ముంబైలోని ఘటన ఎక్కువ ఆకర్షణ పొందింది. కస్టమర్లు 'కాస్మిక్ ఆరెంజ్ ఖతీనీ ఓజీలీ కోసం రాత్రి 8 గంటల నుంచి వెయిట్ చేస్తున్నారని, కెమెరా, డిజైన్ మార్పులు ఆకర్షించాయని చెప్పుకున్నారు.ఇండియాలో ఐఫోన్ డిమాండ్ ఎందుకు ఇంత ఎక్కువ? ముందుగా, ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ గత ఐదేళ్లలో 25% వృద్ధి చెందింది. ఆపిల్ దీనిలో 60% షేర్ పొందింది. యువతలో స్టేటస్ సింబల్‌గా మారిన ఐఫోన్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల మార్కెటింగ్ వల్ల ఎక్కువ ఆకర్షణ పొందుతోంది. ఇండియాలో ఆపిల్ స్టోర్లు (2023లో ఓపెన్ అయినవి) ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ అందిస్తున్నాయి, ఇది లాంచ్ డేను ఈవెంట్‌గా మార్చింది. ఆర్థికంగా, మధ్యతరగతి ఆదాయం పెరగడం, అయితే, ఈ క్రేజ్ విమర్శలు కూడా ఉన్నాయి ? హై ప్రైస్ డెస్పైట్ లోకల్ మాన్యుఫాక్చరింగ్, 'ఆక్సిజన్ వేర్' అనే ట్రోల్స్. ముంబై ఘటన ఈ క్రేజ్‌ను 'షాకింగ్'గా చూపిస్తూ, భవిష్యత్ లాంచ్‌లలో మరిన్ని మేనేజ్‌మెంట్ చర్యలు అవసరమని సూచిస్తోంది. ఐఫోన్ 17 కోసం క్యూ లైన్లో బార్లు తీరిన ఐఫోన్ లవర్స్ ఇండియాలో ఐఫోన్ 17 సిరీస్ 4 అధికారిక స్టోరుల్లో అందుబాటులోకి వచ్చాయి

# ఆరోగ్య శ్రీ సేవలపై డోలాయామానం




### ఆస్పత్రుల మాటొకటి... సర్కారీ మరొకటి

**హైదరాబాద్, తెలంగాణ దిశ:** తెలంగాణలో 1400 కోట్ల రూపాయల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు ఆసుపత్రిలో సేవల ధరలు 20శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులు సేవలు నిలివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే తాజాగా జరుగుతున్న పరిణామాలు రోగులను అయోమయంలో పడేస్తున్నాయి.ప్రవేటు ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రులలో సేవలు కొనసాగిస్తూ, వేరేవాటిలో మాత్రం సేవలు నిలివేవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభుత్వం స్పందిస్తూ కేవలం 13శాతం ఆసుపత్రులలో మాత్రమే ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయని, మిగతా ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వైద్యం అందుతోందని అంటోంది. ఇలా విభిన్న ప్రకటనల ద్వారా ఆరోగ్యశ్రీ సేవల విషయంలో సందిగ్ధం నెలకొంది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2008లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లోకి వచ్చింది. పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిచాలనే లక్ష్యంతో మొదలైన ఈ పథకం తరువాతి కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది, నేటికీ ఎదుర్కొంటూనే ఉంది. వైఎస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరోగ్యశ్రీ పథకం ఆయన మరణం తరువాత రోశయ్య హాయంలో కొంతకాలం ఆటంకాలు లేకుండా కొనసాగింది. ప్రవేటు ఆసుపత్రులకు బిల్లులు చెల్లించడం కోసం అప్పట్లో ఈ పథకం కొ?సం ప్రత్యేకంగా గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి మరీ 45 రోజుల్లోపే ప్రవేటు ఆసుపత్రులకు బకాయిలు విడుదల చేసేవారు. అప్పట్లో ఐఎస్ అధికారి బాబు ప్రత్యేక చొరవతో ఆసుపత్రులకు ఎటువంటి ఇబ్బందులు రాలేదు.2014 తరువాత పరిస్దితులు పూర్తిగా మారిపోయాయి. పెరుగుతున్న వేతనాలు, ఆసుపత్రి నిర్వహణ వ్యయం దృష్టిలో పెట్టుకుని ప్రతీ రెండేళ్లకోసారి రివ్యూచేసి , 20శాతం వైద్య సేవల ఖర్చు పెంచాలని ప్రవేటు ఆసుపత్రులు చేసిన వినతిని పరిగణలోకి తీసుకున్న అప్పటి ప్రభుత్వం , ఖచ్చితంగా పెంచుతామని హామీ ఇచ్చింది. అది మొదలు నేటి వరకూ ఒక్కసారి కూడా వైద్యసేవల ఖర్చు పెంపుపై కనీసం రివ్యూ చేసిన దాఖలాలు లేవు. 20శాతం కాదుకదా, పైసా కూడా పెంచిన పరిస్దితి లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ముఖ్య మంత్రి హోదాలో ఆరోగ్యశ్రీపై కనీసం ఒక్కటంటే ఒక్క సమీక్ష నిర్వహించలేదని నెట్ వర్క్ ఆసుపత్రులు ఆరోపిస్తున్నాయి. ఏళ్లతరబడి పేరుకుపోయిన నెట్ వర్క్ ఆసుపత్రుల సమస్యలు కనీసం పరిష్కారం దిశగా ఒక్క అడుగు పడలేదంటున్నారు. హరీష్ రావు మంత్రిగా ఉన్న సమయంలో కొంత వరకూ నిధులు విడుదల చేశారు. గత రెండేళ్లుగా పాత బకాయిలు పూర్తిగా చెల్లించడం మానేశారు. ఇలా కర్ణుడి చావుకి వంద కారణాలు అన్నట్లుగా వైఎస్ హాయం తరువాత నెమ్మదిగా ఆరోగ్యశ్రీ తీవ్ర నిర్లక్ష్యానికి గురైయ్యిందనేది వాస్తవం. ఒకప్పుడు 20శాతం ఉచితంతో మొదలైన ఆరోగ్యశ్రీ తరువాత కాలంలో బిపిఎల్ లబ్దిదారులకు 80శాతం ఉచితం వైద్యం అందిస్తున్నాం. ఇలా దాదాపు పూర్తి స్దాయిలో క్రెడిట్ పై వైద్యసేవలు అందించడం, 1400కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు పేరుకు పోవడంతో దిక్కుతోచని స్దితిలో ఆరోగ్యశ్రీ సేవలు నిలివేస్తున్నామని చెబుతున్నాయి నెట్ వర్క్ ఆసుపత్రులు. రెండు రోజులుగా తెలంగాణలో ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతపై నెట్ వర్క్ ఆసుపత్రులకు తెలంగాణ ప్రభుత్వం స్వీట్ వార్నింగ్ ఇచ్చింది. వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా స్పందిస్తూ, గత ప్రభుత్వం నెలకు 50 కోట్ల రూపాయాలు మాత్రమే నిధులు విడుదల చేసింది, మేము 100 కోట్లు ఇస్తున్నాం. దయచేసి అర్థం చేసుకోండి. మీకు ఇచ్చిన అవకాశం మిస్ యూజ్ చేసుకోవద్దంటూ చెప్పారు.

# యూరియా కోసం రైతుల రాస్తారోకో




**బెజ్జూర్, తెలంగాణ దిశ:** బెజ్జూరు మండలం లో ఎన్ని యూరియా బస్తాలు వచ్చిన యూరియా సక్రమంగా అందడం లేదని రైతులు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగారు. అధికారులు వచ్చే యూరియా ఇచ్చేవరకు వదిలిపెట్టేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. బెజ్జూరు మండలానికి 2000 టన్నుల యూరియా వచ్చినప్పటికీ అధికారులు పంపిణీ చేయడంలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని డిసి ఎంఎస్ లో యూరియా రైతులకు ఇవ్వకుండా, మహారాష్ట్రకు విక్రయించుకున్నారని దీంతో తమకు యూరియా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వరి పంటలు ఎండిపోతున్న యూరియా అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సర్దాజ్ పాషా, వ్యవసాయ అధికారి నాగరాజు సంఘటన స్థలాన్ని సందర్శించారు. రైతులకు కూపన్లు అందజేస్తున్నట్లు వ్యవసాయ అధికారి నాగరాజు, ఎస్సై పాస్ సర్దాజ్ పాషా హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

## ముదిరాజ్ కులాన్ని బీసీ- ఏ గ్రూప్ లోకి మార్చాలని మంత్రికి వినతి



**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** ముదిరాజ్ కులాన్ని బిసి డి గ్రూప్ నుండి ఏ గ్రూప్‌లోకి మార్చాలని మంత్రి వాకిటి శ్రీహరికి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దబ్బెట తిరుపతి విన్నవించి, వినతి పత్రం అందజేశారు. ఆయన హైదరాబాద్ లోనిమంత్రి కార్యాలయంలో కలిసి ముదిరాజ్ సమస్యలపై తెలిపి, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి వడ్డీలేని రుణాలు అందించాలని కోరారన్నారు. గ్రా మీణ ప్రాంత ముదిరాజ్ లకు చేపల చెరువులు కేటాయించాలని, జిల్లాలో మహాసభకు సహకరించాలని కోరినట్లు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆయన వెంట పలువురు ముదిరాజ్ యువనాయకులు, తదితరులు ఉన్నారు.

## మళ్లీ అంబానీ ఫస్ట్



దేశీయ శ్రీమంతుల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తిరిగి తొలి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుత సంవత్సరంలో ఆయన సంపద ఆరు శాతం తగ్గి రూ.9.55 లక్షల కోట్లకు పరిమితమైనప్పటికీ దేశీయ కుబేరుల జాబితాలో తిరిగి తొలి స్థానంలో నిలిచారని ఎం3ఎం హురున్ ఇండియా 2025 సంవత్సరానికిగాను విడుదల చేసిన సంపన్నవర్గాల నివేదికలో వెల్లడించింది. గతేడాది రూ.11.6 లక్షల కోట్ల సంపదతో తొలిస్థానంలో నిలిచిన అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ ఈసారికిగాను రూ.8.14 లక్షల కోట్ల సంపదతో రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. హెచ్‌సీఎల్ చైర్మన్ రోష్నీ శివ్ నాడార్ తొలిసారిగా మూడో స్థానాన్ని చేజిక్కించుకున్నారు. రూ.2.84 లక్షల కోట్ల సంపదతో ఈ స్థానం లభించింది. సైరస్ పూనావాలా తన నాలుగో స్థానాన్ని పదిలపరుచుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో కుమార మంగళం బిర్లా(రూ.2.32 లక్షల కోట్లు), మొత్తంగా దేశీయ కుబేరుల సంపద విలువ రూ.167 లక్షల కోట్లకు ఎగబాకింది.

## వచ్చే ఏడాది నుంచి హెచ్-1బీ ఫీజులు...

వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి హెచ్-1బీ వీసా ఫీజు నిర్ణయం అమల్లోకి వస్తుందని, ఇది వచ్చే ముందే వీసా ప్రక్రియలోనూ భారీ మార్పులు ఉంటాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హెవార్డ్ లుట్నిక్ తెలిపారు. తాజాగా ఆయన ఓ మీడిచా చానల్‌తో మాట్లాడారు. ప్రస్తుత హెచ్-1B వీసా ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని అభివర్ణించారు. దీని వల్ల తక్కువ ఖర్చుతో కూడిన టెక్ కన్సల్టెంట్ల ప్రవేశానికి వీలు కలుగుతుందని తెలిపారు. అంతేగాక వారు తమ కుటుంబాలను సైతం అమెరికాకు తీసుకువస్తారన్నారు. ఇది పూర్తిగా తప్పుడు ఆలోచన అని చెప్పారు. భవిష్యత్‌లో ఈ వీసా సిస్టమ్‌లో మార్పులను చూస్తామని తెలిపారు. దీనిపై 2026 ఫిబ్రవరి నాటికి స్పష్టత వస్తుందన్నారు. ఆలోచనాత్మక మార్పును చూడబోతున్నారని భావిస్తున్నట్టు వెల్లడించారు. తక్కువ ఖర్చుతో కూడిన టెక్ కన్సల్టెంట్ల కంటే అధిక నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఫ్యూచర్ రీఫామ్స్ విద్య, వైద్యం వంటి రంగాల్లోని నిపుణులకు ప్రాధాన్యత ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, హెచ్-1బీ వీసాను ట్రంప్ భారీగా పెంచిన విషయం తెలిసిందే.

## వరుసగా ఎనిమిదో రోజు.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల్లో కొనసాగుతున్నాయి. మంగళవారం వరుసగా ఎనిమిదో రోజు మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం లాభాల్లో మొదలైనా.. చివరకు నష్టాలు తప్పలేదు. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,541.77 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మధ్యాహ్నం వరకు మళ్లీ కోలుకున్నా కొద్దిసేపటికే మళ్లీ తగ్గాయి. ఇంట్రాడేలో 80,677.82 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,201.15 పాయింట్లకు చేరింది.చివరకు 97.32 పాయింట్లు తగ్గి.. 80,267.62 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 23.80 పాయింట్లు తగ్గి 24,611.10 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 1,970 షేర్లు లాభపడగా.. 1,939 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, హిందాల్కో, సిప్లా, బజాజ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రికల్, శ్రీరామ్ ఫైనాన్స్ లాభపడ్డాయి. ఇక ఇంటర్‌గ్లోబ్ ఏవీఐ, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్, టైటాన్ కంపెనీ, బజాజ్ ఫిన్‌సర్వ్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, బజాజ్ ఆటో, లార్సెన్ నష్టపోయాయి.

## 8 నెలలు.. 30000 సేల్స్: అమ్మకాల్లో కైలాక్ హవా!

స్కోడా కంపెనీ ఇండియన్ మార్కెట్లో లాంచ్ చేసిన కైలాక్ కారు అమ్మకాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. కేవలం 8 నెలల్లో 30000 యూనిట్ల కంటే ఎక్కువ సేల్స్ సాధించింది. ఇది కంపెనీ సేల్స్ పెరగడానికి కూడా దోహదపడింది.2025 జనవరిలో 1242 యూనిట్ల అమ్మకాలను సాధించిన స్కోడా కైలాక్.. ఆగస్టులో 3099 యూనిట్ల సేల్స్ పొందగలిగింది. ఇలా మొత్తం మీద ఈ కారు జనవరి నుంచి ఆగస్టు మధ్య కాలంలో 30190 అమ్మకాలు పొందింది.



## జియో 3 నెలల ప్లాన్: చౌకగా డైలీ 2జీబీ.. అన్‌లిమిటెడ్


రిలయన్స్ జియో తన 9వ వార్షికోత్సవాన్ని ఇటీవలె జరుపుకొంది. అప్పటి నుండి, కంపెనీ తన వినియోగదారుల కోసం అనేక రీఛార్జ్ ప్లాన్‌లపై ప్రత్యేక ఆఫర్‌లను అందిస్తోంది. అందులో ఒకటే రూ.899 ప్లాన్. దీంతో హై స్పీడ్ డేటా, అపరిమిత కాలింగ్‌తో పాటు ఇతర ఆకట్టుకునే ప్రయోజనాలను అందిస్తోంది. జియో నుండి వచ్చిన ఈ ఆకట్టుకునే ప్లాన్ ధర రూ.899. పూర్తి 90 రోజుల వ్యాలిడిటీని అందిస్తుంది. రోజుకు 2జీబీ హై-స్పీడ్ డేటాతో పాటు 20జీబీ అదనపు డేటాను కూడా అందిస్తోంది. అంటే మొత్తం డేటా 200%+దీ% అవుతుంది. ఇంకా ఈ ప్లాన్ అపరిమిత కాలింగ్ ను కూడా అందిస్తుంది. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పంపించుకోవచ్చు. జియో 5జీ నెట్ వర్క్ ఉన్న ప్రాంతంలో నివసిస్తుంటే ఈ ప్లాన్ తో అపరిమిత 5జీ డేటాను ఆనందించవచ్చు. డేటా, కాలింగ్ మాత్రమే కాదు, ఈ ప్లాన్ జియో టీవీ, జియో ఐ క్లౌడ్, జియో హాట్ స్టార్ కు ఉచిత సబ్ స్క్రిప్షన్ లతో సహా ఇతర ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఈ ప్లాన్‌లో 3నెలల జియో హాట్ స్టార్ మొబైల్, టీవీ సబ్ స్క్రిప్షన్ కూడా చేర్చారు. అదనంగా, ఈ ప్లాన్ లో 3 నెలల




పాటు జియోసావ్ ప్రోకు 1 నెల జొమాటో గోల్డ్ సబ్ స్క్రిప్షన్, ఉచితంగా 6 నెలల నెట్ మెడ్స్ ఫస్ట్ సభ్యత్వం ఉన్నాయి. ఇంకా ఈజీ మై ట్రిప్ పై రూ .2220 వరకు డిస్కౌంట్, హెూటల్ బుకింగ్ లపై 15% వరకు తగ్గింపును అందిస్తుంది. అజియోపై రూ.200 తగ్గింపు, రిలయన్స్ డిజిటల్‌పై రూ.399 వరకు తగ్గింపును కూడా పొందుతారు.

## ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్‌లో కేటీఎం టీమ్..

ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్ (ఐఎస్ఆర్ఎల్) కేటీఎం రేసింగ్, ట్రైకలర్ మోటార్ స్పోర్ట్స్ మధ్య కీలక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. దీని కింద ఐఎస్ఆర్ఎల్ సీజన్2లో కేటీఎం ప్రత్యేక నేమింగ్ రైట్స్ పార్టనర్, అధికారిక బైక్ భాగస్వామిగా మారింది. బ్రాండ్ అంబాసిడర్, ఇన్వెస్టర్‌గా బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ ఈ లీగ్‌కు మద్దతిస్తున్నారు. ఈ భాగస్వామ్యం కింద, కేటీఎం ట్రైకలర్ మోటార్ స్పోర్ట్స్ పేరుతో రేసింగ్ టీమ్ పోటీపడనుంది. భారతీయ మోటార్ స్పోర్ట్ ఫ్రాంచైజీకి ఒక ప్రపంచ మోటార్ సైకిల్ తయారీ సంస్థ పేరు హక్కులను పొందడం ఇదే మొదటిసారి. అనేక ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్స్ తో కేటీఎం దశాబ్దాల ప్రపంచ రేసింగ్ నైపుణ్యాన్ని మోటోక్రాస్, సూపర్ క్రాస్‌లలో తీసుకురానుంది. ప్రపంచ స్థాయి మోటార్ స్పోర్ట్స్ వ్యవస్థను నిర్మించడానికి ప్రపంచ బ్రాండ్లను భారతీయ జట్లతో ఏకం చేయాలనే లీగ్ దృష్టికి ఈ భాగస్వామ్యం సరిపోతుందని ఐఎస్ఆర్ఎల్ ప్రమోటర్ వీర్ పటేల్ అన్నారు. టీవీ, ఓటీటీ




ప్లాట్ ఫామ్ లలో 20 మిలియన్లకు పైగా వీక్షకులతో విజయవంతమైన సీజన్ 1 తరువాత, సీజన్2 అక్టోబర్ 25-26 తేదీల్లో ప్రారంభమవుతుంది. తర్వాత రేసులు డిసెంబర్ 6-7, డిసెంబర్ 20-21 తేదీలలో మూడు వేర్వేరు వేదికలలో జరుగుతాయి.

## లక్ష 20 వేలకు చేరువగా బంగారం ధర


న్యూఢిల్లీ: 2025 దసరా, దీపావళి పండుగ సీజన్‌లో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వరుసగా ఐదవ రోజు గోల్డ్ రేట్స్ పెరిగాయి. సెప్టెంబర్ 26 నుంచి వరుసగా పెరిగాయి. ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1,200 పెరగగా.. 22 క్యారెట్లపై రూ.1,100 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో బుధవారం (అక్టోబర్ 1) 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,18,640గా.. 22 క్యారెట్ల ధర రూ.1,08,750గా ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ మార్కెట్‌లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. వరుసగా పెరుగుతూ వస్తున్న వెండి ధర ఇవాళ కాస్త బ్రేక్ ఇచ్చింది. గత 10 రోజుల్లో 16 వేలు పెరిగిన వెండి రేటు నేడు స్థిరంగా ఉంది. నేడు బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,51,000గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విశాఖ, విజయవాడలో కిలో వెండి లక్ష 60 వేలుగా ఉంది. పండుగ సీజన్‌లో బంగారం, వెండి ధరలు అమాంతం పెరిగిపోతుండటంతో సామాన్యులపై పెను భారం పడుతోంది. పెరిగిన ధరలతో బంగారం కొనాలంటే భయపడుతున్నారు.దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ హైకి చేరాయి. ఇటీవలికాలంలో గోల్డ్, సిల్వర్ రేట్లు క్రమేణా పెరుగుతూ సరికొత్త రికార్డులను సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవారం తులం పసిడి, కిలో వెండి విలువ మరో రూ.1,000 చొప్పున ఎగిశాయి. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా



ఢిల్లీలో 99.9 స్వచ్ఛత (24 క్యారెట్) కలిగిన 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,05,670గా నమోదైంది. అలాగే కిలో వెండి రూ.1,26,000కు చేరిందని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. కాగా, శనివారం ఒక్కరోజే రూ.6,000 ఎగబాకడం గమనార్హం. సాధారణ కొనుగోలుదారుల తోపాటు పరిశ్రమ వర్గాలనుంచి పెరుగుతున్న డిమాండ్ ధరలు విజృంభించేలా చేస్తున్నదని వ్యాపారులు అంటున్నారు. అంతర్జాతీయ కారణాలతోనే దేశీయంగా బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి.

## మళ్లీ షాక్ ఇచ్చిన బంగారం.. తులం గోల్డ్ రూ.1.20లక్షలు.. వెండి కిలోకు రూ.1.50లక్షలు..!

పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇస్తూనే ఉన్నాయి. ఇటీవల గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయికి చేరాయి. తాజాగా మరోసారి జీవితకాల గరిష్టానికి చేరుకున్నాయి. డాలర్ బలహీనపడడం, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలకు రెక్కలు వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధరలు మంగళవారం మరోసారి పెరిగాయి. 24 క్యారెట్ల బంగారంపై రూ.500 పెరిగి తొలిసారిగా తులం ధర రూ.1.20లక్షలకు పెరిగి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ ధర సైతం రూ.500 పెరిగి తులం రూ.1,19,400కి పెరిగి జీవితకాల గరిష్టానికి చేరుకుంది.ఇక వెండి సైతం రూ.500 పెరగడంతో కిలో రూ.1,50,500 పెరిగి ఆల్‌టైమ్ హైకి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధరల పెరుగుదలను ధ్రువీకరించింది. ట్రంప్, యూఎస్ కాంగ్రెస్ నేతల మధ్య చర్చలు స్వల్పకాలిక నిధులపై ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. దాంతో యూఎస్ ప్రభుత్వం షట్‌డౌన్ అయ్యే అవకాశాలు పెరుగుతుందని పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో బంగారం ధరలు పెరిగాయని.. అధికారిక ఉపాధి నివేదిక విడుదల ఆలస్యమవుతుందని.. ఫెడరల్ రిజర్వ్ విధాన పురోగతి కిష్టతరం చేస్తుందని కోటక్ సెక్యూరిటీస్‌లో కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపారు. మరో వైపు డాలర్ ఇండెక్స్ 0.10 శాతం తగ్గి 97.80 వద్ద ట్రేడవుతోంది.ఇది బులియన్ ధరలకు మరింత మద్దతుగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు భారీగా లాభాల స్వీకరణకు



దిగడంతో బులియన్ ధరలు రికార్డు స్థాయిల నుండి పడిపోయాయి. స్పాట్ బంగారం 0.55 శాతం తగ్గి ఔన్సుకు 3,813.14 డాలర్లకు చేరుకుంది. విదేశీ మార్కెట్లలో స్పాట్ వెండి 1.51 శాతం తగ్గి ఔన్సుకు 46.22 డాలర్లకు తగ్గింది. బంగారం ఔన్సుకు 3,871 డాలర్లకు చేరిందని.. ప్రస్తుతం ఔన్సుకు 3,818 వద్ద ట్రేడవుతోందని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ అండ్ కరెన్సీ హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల బంగారం రూ.1,17,440 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.1,07,650 పలుకుతుంది. వెండి కిలోకు రూ.1.61లక్షలు పలుకుతున్నది.

## జనరల్ రైలు టికెట్‌కు ఆధార్ తప్పనిసరి..!

భారతీయ రైల్వే ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నది. నిబంధనల్లో పలు మార్పులు చేసింది. జనరల్ రిజర్వేషన్ టికెట్లకు సైతం ఆధార్ అథంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. ఈ నిబంధన అక్టోబర్ ఒకటి నుంచి అమలులోకి రానున్నది. మారిన నిబంధనల ప్రకారం.. జనరల్ రిజర్వేషన్ల టికెట్లను బుక్ చేసుకునే సమయంలో ఆధార్ నంబర్‌ను తప్పనిసరిగా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అయితే, టికెట్లు ఓపెన్ అయిన 15 నిమిషాల వరకు మాత్రమే ఆధార్ నిబంధన వర్తిస్తుంది. రైల్వే టికెట్ల బుకింగ్ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడంతో పాటు మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వే బోర్డు ఈ కీలక నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపింది. ఈ నిబంధన ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ రెండింటిలోనూ వర్తిస్తుందని రైల్వేశాఖ పేర్కొంది. వాస్తవానికి రైల్వే టికెట్లు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఏజెంట్లు, బ్రోకర్లు కొన్ని సాఫ్ట్‌వేర్‌ల సహాయంతో ముందస్తుగానే టికెట్లను బుక్ చేస్తున్నట్లుగా రైల్వే గుర్తించింది. దాంతో సాధారణ రైల్వే ప్రయాణికులు టికెట్లు పొందలేకపోతున్నారు. అయితే, రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుకింగ్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇందుకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేసుకోవాలని రైల్వేబోర్డు అన్ని రైల్వేలు, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఐఆర్‌సీటీసీని సర్క్యులర్‌ను పంపింది. ప్రస్తుతం జనరల్ రిజర్వేషన్ కోసం బుకింగ్‌ను ప్రతిరోజూ అర్ధరాత్రి 12.20 గంటలకు మొదలై.. రాత్రి 11.45 గంటల వరకు కొనసాగుతుంది. మిగతా సమయాల్లో మేయింటనెన్స్ పనులు జరుగుతాయి. జనరల్ టికెట్ల అడ్వాన్స్ టికెట్ బుకింగ్ ఏదైనా రైలు ప్రయాణ తేదీకి 60 రోజుల ముందు మొదలవుతుంది. అర్ధరాత్రి




12.20 గంటలకు టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. అంటే ఇకపై ఎవరైనా సంబంధిత రైలు టికెట్లు విడుదలయ్యే 15 నిమిషాల ముందు తప్పనిసరిగా ఆధార్ అథంటికేషన్ చేస్తేనే టికెట్లు బుక్ అయ్యే అవకాశం ఉంటుంది. లేకపోతే టికెట్లు బుక్ అయ్యే అవకాశం ఉండదు. 15 నిమిషాలు ఆగాల్సి ఉంటుంది. అప్పటి వరకు టికెట్లు ఉంటేనే బుక్ చేసుకునే వీలుంటుంది. రైల్వే నిర్ణయంతో సాధారణ ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనున్నది. పండుగల సమయంలో రైళ్ల టికెట్లకు భారీగా గిరాకీ ఉంటుంది. బుకింగ్ మొదలైన కొద్ది సమయంలోనే కొన్ని రైళ్లలో టికెట్లు నిండిపోతున్నాయి.

## కొనుగోళ్ల మద్దతుతో..



ముంబై, : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఆటో, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లకు మదుపరుల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 7.8 శాతంగా నమోదవడం మదుపరులను ఉత్సాహపర్చింది. దీంతో ఉదయం ఆరం భం నుంచీ మార్కెట్లు లాభాల్లోనే కదలాడాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 554.84 పాయింట్లు లేదా 0.70 శాతం పెరిగి 80,364.49 వద్ద నిలిచింది.

ఒకానొక దశలో 597.19 పాయింట్లు పుంజుకున్న ది. నిఫ్టీ సైతం 198.20 పాయింట్లు లేదా 0.81 శాతం అందుకుని 24,625.05 వద్ద స్థిరపడింది. అంతకుముందు 3 రోజులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో ఈక్విటీ మార్కెట్లు నష్టాలకే పరిమితమైన విషయం తెలిసిందే. ఆసియా మార్కెట్లలో చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో.. దక్షిణ కొరియా, జపాన్ సూచీలు నష్టాల్లో ముగిశాయి.

## యూపీఐ లావాదేవీల రికార్డు

న్యూఢిల్లీ, : యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత నెలలో 20 బిలియన్ల లావాదేవీలు జరిగినట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. విలువ పరంగా చూస్తే రూ.24.85 లక్షల కోట్లుగా నమోదైంది. జూలై నెలలో నమోదైన రూ.25.08 లక్షల కోట్ల కంటే ఇది తక్కువగా నమోదుకావడం విశేషం. అలాగే మే నెలలో రికార్డు స్థాయి రూ.25.14 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన రూ.20.60 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే మాత్రం 21 శాతం పెరిగాయి. సరాసరిగా గత నెలలో రోజుకు రూ.80,177 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయని ఎన్‌పీసీఐ తాజాగా వెల్లడించింది. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో 85 శాతం యూపీఐ ద్వారా జరుగుతుండటం విశేషం.




## ట్రంప్ మరో టారిఫ్ బాంబ్.. కలప, ఫర్నిచర్‌పై సుంకాల మోత



విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. ఫర్నిచర్, కలపపై సుంకాల మోత మోగించారు. కలప పై 10 శాతం, కిచెన్ క్యాబినెట్‌లుఅప్‌హెూల్‌స్టర్డ్ ఫర్నిచర్ పై 25 శాతం సుంకాలను ప్రకటించారు. ఈ టారిఫ్‌లు అక్టోబరు 14 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా సోమవారం ప్రకటించారు. విదేశాలలోని పోటీదారులు అమెరికన్ సినీ వ్యాపారాన్ని కొల్లగొడుతున్నారని ట్రంప్ తెలిపారు. పసిబిడ్డ నుంచి చాక్లెట్ చోరీ చేసిన విధంగానే ఇతర దేశాలు అమెరికా సినీ నిర్మాణ వ్యాపారాన్ని చోరీ చేస్తున్నాయి అని ట్రంప్ ఆరోపించారు. బలహీన, అసమర్థ గవర్నర్ కారణంగా ప్రత్యేకంగా కాలిఫోర్నియా తీవ్రంగా నష్టపోయింది అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎన్నటికీ పరిష్కారం కాని ఈ సుదీర్ఘ సమస్యను పరిష్కరించేందుకు అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు.

## వడ్డీరేట్లు పావు శాతం తగ్గించే అవకాశం!

ముంబై : రిజర్వు బ్యాంక్ తన ద్రవ్య పరపతి సమీక్ష సమావేశాన్ని ప్రారంభించింది. ఈ సారి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగాను, లేకపోతే పావు శాతం తగ్గించే అవకాశాలున్నాయనే అంచనాలువెలవడుతున్నాయి. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్యపరపతి సమీక్ష కమిటీ తన మూడు రోజుల పాటు సమీక్షించి వడ్డీరేట్లను తన నిర్ణయాన్ని ఈ బుధవారం(అక్టోబర్ 1న) ప్రకటించనున్నది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు, దేశీయ ఎగుమతులపై అమెరికా 50 శాతం టారిఫ్‌ను విధిస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు రిజర్వుబ్యాంక్ మూడు విడతలుగా వడ్డీరేట్లను ఒక్క శాతం లేదా 100 బేసిస్ పాయింట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ధరల సూచీ తగ్గుముఖం పట్టడం వల్లనే ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది.కానీ, ఆగస్టు నెలవారి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది. అమెరాకి ప్రతీకార సుంకాల విధింపు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సెంట్రల్ బ్యాంక్ వేచిచూసేదోరణి అవలంభించింది. అవకాశం ఉన్నదని గోల్డ్‌మాన్ చాక్స్ కానీ, డిసెంబర్ సమీక్షలో మాత్రం పావు శాతం తగ్గి 5.25 శాతానికి దించవచ్చని అభిప్రాయపడింది. ప్రస్తుత పండుగ సీజన్‌లో వడ్డీరేట్లను తగ్గిస్తే గృహ రుణాలు తీసుకునేవారు గణనీయంగా పెరుగుతారని హౌజింగ్.కామ్ సీఈవో ప్రవీణ్ శర్మ తెలిపారు. మరోవైపు, నూతన జీఎస్టీ అమలులోకి రావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయని, అక్టోబర్ నెలకుగాను ధరల సూచీ 1.1 శాతానికి పరిమితంకానున్నదని ఎస్బీఐ తన నివేదికలో వెల్లడించింది.

# సినిమా..

## 100 రోజుల ముందు ట్రైలర్..



పోస్టర్ మీద నాలుగైదు భాషల్లో రిలీజ్ అంటూ ఘనంగా ప్రకటించుకునేవాళ్లే కానీ.. పాన్ ఇండియా స్థాయిలో సరిగ్గా సినిమాను ప్రమోట్ చేసి రిలీజ్ చేసేవాళ్లు తక్కువ. పాన్ ఇండియా స్థాయిలో సినిమా ప్రభావం చూపాలంటే ముందుగా షూటింగ్ పూర్తి చేయడం, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా పర్ఫెక్ట్‌గా జరగడం.. ఇతర భాషల్లో డబ్బింగ్ సరిగ్గా ఉండడం.. దేశవ్యాప్తంగా ప్రమోషన్లు బాగా చేయడం చాలా అవసరం. కానీ ఈ ప్లానింగ్ అన్ని సినిమాలకూ పర్ఫెక్ట్‌గా జరగదు.పవన్ కళ్యాణ్ సినిమా 'ఓజీ' సైతం పాన్ ఇండియా మూవీనే. కానీ ఇతర భాషల్లో నామమాత్ర ంగా రిలీజైంది. ఐతే ప్రభాస్ సినిమా 'రాజా సాబ్' విషయంలో మాత్రం టీం పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో రంగంలోకి దిగుతోంది. ప్రభాస్‌కు మిగతా ఏ ఇండియన్ స్టార్‌కూ లేని స్థాయిలో దేశవ్యాప్తంగా ఫాలోయింగ్, మార్కెట్ ఉన్న మాట వాస్తవం. దాన్ని పూర్తిగా ఉపయోగించుకునేలా 'రాజా సాబ్' టీం అడుగులు వేస్తోంది. 'రాజా సాబ్' చిత్రీకరణ పూర్తి కావచ్చింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా చివరి దశలో ఉన్నాయి. ప్రమోషన్లు కూడా గట్టిగా చేసేలా ఉన్నారు. సినిమా రిలీజ్‌కు ఏకంగా 100 రోజుల ముందే దీని ట్రైలర్‌ను లాంచ్ చేస్తుండడం విశేషం. ఈ సోమవారం సాయంత్రమే ట్రైలర్ వస్తోంది. 'రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. సరిగ్గా వంద రోజుల గ్యాప్ పెట్టుకుని ఇప్పుడే ట్రైలర్ లాంచ్ చేస్తున్నారు. బహుశా పాన్ ఇండియా సినిమాల్లో ఇంత ముందుగా ట్రైలర్ లాంచ్ అవుతున్న సినిమ ఇదే కావచ్చు. రిలీజ్ డేట్ ఖరారైపోవడంతో ఇప్పట్నుంచే విడుదలకు కౌంట్‌డౌన్ మొదలవుతుంది. ట్రైలర్ బాగుంటే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులు సినిమా కోసం ఎదురు చూస్తారు. తర్వాత రెగ్యులర్‌గా ప్రమోషనల్ కంటెంట్ వదులుతూ.. దేశవ్యాప్తంగా ఈవెంట్లు చేస్తూ హైప్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేయనుంది టీం. ముందు ట్రైలర్ లాంచ్ చేసి తర్వాత పాటలు, ఇతర కంటెంట్ వదలడం అరుదైన విషయమే. ఎలాగూ విడుదల దగ్గర్లో రిలీజ్ ట్రైలర్ అంటూ ఇంకో ప్రోమో వదులుతారు. చూస్తుంటే 'రాజా సాబ్' రిలీజ్ టైంకి హైప్ వేరే లెవెల్‌కు వెళ్లేలాగే కనిపిస్తోంది.

## పవన్ కళ్యాణ్ ఓజీకి ఎదురు దెబ్బ!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఓజీ' సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.250 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫ్యాన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక షోలు, టికెట్ ధరల పెంపు కూడా కలెక్షన్స్ పెరగడానికి తోడ్పడింది. అయితే తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఈ సినిమాకి గట్టి షాక్ ఇచ్చింది. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 4 వరకు 'ఓజీ' కి టికెట్ రేట్లు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది.మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్లలో పెరిగిన ధరలకు టికెట్లు విక్రయించడానికి జీఓ కూడా జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.100/–, మల్టీప్లెక్స్‌లలో రూ.150/– మేర టికెట్ రేట్లు పెంచేందుకు తెలంగాణ సర్కార్ అనుమతినిచ్చింది.కానీ ఈ నిర్ణయంపై బర్ల మల్లేష్ యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టికెట్ ధరల పెంపు సామాన్య ప్రేక్షకులపై భారం మోపుతోందని, అదిఅన్యాయం అని వాదించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు తాజాగా టికెట్ ధరల పెంపుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. దీనిని అనుస రించి రాష్ట్ర పోలీస్ శాఖ సోమవారం మరో జీఓ విడుదల చేస్తూ, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆదేశించింది. సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్ యాజమాన్యాలు ఇకపై కేవలం సాధారణ రేట్లకే టికెట్లు అమ్మాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ నిర్ణయం హాట్‌టాపిక్‌గా మారింది. అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా,సామాన్య ప్రేక్షకులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ధరలు తగ్గడంతో మరింత మంది ప్రేక్షకులు థియే టర్లకు రావచ్చని, ఇది చివరికి సినిమాకే లాభమవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా,బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తున్న 'ఓజీ' కి టికెట్ రేట్ల తగ్గింపు కొత్త మలుపు తీసుకువచ్చింది.

## రీఎంట్రీ బాలయ్య సినిమాతోనే?



ఎన్టీఆర్ బయోపిక్స్ కథానాయకుడు, మహానాయకుడు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరవయ్యారు బాలీవుడ్ నటి విద్యాబాలన్. ఆ చిత్రాల్లో ఆమె ఎన్టీఆర్ సతీమణి బసవతారం పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ తెలుగు తెరపై విద్యాబాలన్ కనిపించలేదు. అయితే.. మళ్లీ ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారనేది లేటెస్ట్ న్యూస్. అది కూడా బాలయ్య సినిమాతోనేనట. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ 'అఖండ' సీక్వెల్ 'అఖండ – తాండవం' షూటింగ్‌లో బాలయ్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్ ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఇందులో కథ రీత్యా ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్ పాత్ర ఉందట. ఆ పాత్రకోసం విద్యాబాలన్‌ని బోయపాటి సంప్రదించారనీ, కథ, పాత్ర విన్న తర్వాత ఆమె చేయడానికి అంగీకరించారని సమాచారం. స్టార్‌హీరోయిన్ విద్యాబాలన్‌తో ఆ పాత్ర చేయిస్తున్నారంటే.. కచితంగా కథలో కీలకమైన పాత్రే అయ్యుంటుదని ప్రేక్షకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఇందులో సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇప్పుడు విద్యాబాలన్ కూడా తోడవ్వడంతో.. 'అఖండ–తాండవం' చిత్రానికి బాలీవుడ్‌లోనూ క్రేజ్ ఏర్పడటం ఖాయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తండ్రి అడుగుజాడలలో కుట్టి తల..



తన విజయాల వెనుక భార్య షాలిని హస్తం ఎంతో ఉందని చెబుతూ ప్రముఖ తమిళ నటుడు అజిత్ కుమార్ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను ఎలాబ్యాలెన్స్ చేస్తున్నారన్న విషయంపై స్పందించారు. భార్య షాలిని సహకారం లేకపోతే తాను ఇంతదూరం రావడం సాధ్యపడేదికాదని అజిత్ స్పష్టంగా పేర్కొన్నారు. "మేము 200 2లో పెళ్లి చేసుకున్నాం. అప్పటినుంచి ఆవెనాకు బలంగా నిలిచింది. నేను రేసింగ్‌కు తిరిగి వచ్చినప్పుడు కూడా ఆమె నాతోపాటే వచ్చేది. ఇంటి విషయాలుపిల్లల సంరక్షణ, నా పనులపై దృష్టి అన్నింటినీ సమర్థంగా నిర్వహించేది అని ఆయన అన్నారు.

పిల్లలు పుట్టిన తర్వాత షాలిని ఎక్కువగా ఇంటికే పరిమితమైపోయినా, మోటార్‌స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని మాత్రం కొనసాగిస్తోందని తెలిపారు. తన కుమారుడు గో–కార్టింగ్ ప్రారంభించిన విషయాన్ని వెల్లడించిన అజిత్, "అతను రేసింగ్‌ను కొనసాగిస్తాడో లేదో అతడే నిర్ణయించాలి. సినిమాలు అయినా, రేసింగ్ అయినానేను నా అభిప్రాయాలను పిల్లలపై రుద్దను.వారు తమ ఇష్టమైన దారిని ఎంచుకోవాలి.వారికి నేను పూర్తి మద్దతు ఇస్తాను," అని అన్నారు. వృత్తిపరంగా తరచూ ప్రయాణాల్లో ఉండడం వల్ల పిల్లలతో గడిపే సమయం కొంత మేర కోల్పోతున్నానని, కానీ నిజంగా ప్రేమించే పనిని చేస్తే కొన్ని త్యాగాలు అవసరమేనని భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రొఫెషనల్ రేసర్‌గా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించిన అజిత్ ఇటీవల 24హెచ్ దుబాయ్ కారు రేసింగ్ పోటీలో తన జట్టుతో కలిసి మూడో స్థానం సాధించగా, ఇటలీలో జరిగిన 12% రేస్‌లోనూ మూడో స్థానం దక్కించుకున్నారు. సినిమాల పరంగా ఈ ఏడాది 'పట్టుదల' మరియు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలతో ప్రేక్షకులముందుకు వచ్చిన అజిత్,త్వరలో తన తదుపరి సినిమా వివరాలను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. రేసింగ్ ట్రాక్‌లో వేగంగా పరిగెత్తే అజిత్, జీవితాన్ని మాత్రం నెమ్మదిగా, విలు వలతో, ప్రేమతో నడిపించడంలోనూ ముందున్నారు.

## నార్త్ అమెరికాలో మిరాయ్ ప్రభంజనం..

యంగ్ హీరో తేజ సజ్జా 'మిరాయ్' తో సంచలన విజయాన్ని అందుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఫాంటసీ డ్రామా జానర్‌లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతూ టాలీవుడ్ చరిత్రలో ప్రత్యేక స్థానం సాధించింది. తాజాగా ఈ సినిమా నార్త్ అమెరికాలో **$3** మిలియన్ గ్రాస్ మార్క్ చేరువలో ఉందని సమాచారం. శనివారం ఒక్క రోజులోనే అమెరికా, కెనడా కలిపి ఈ సినిమా 55,000 డాలర్లు వసూలు చేయడం గమనార్హం. ఇప్పటివరకు అక్కడ మొత్తం 2.98 మిలియన్ గ్రాస్ రాబట్టిన మిరాయ్, సోమవారం నాటికి %వి%3 మిలియన్ క్లబ్‌లో చేరుతుందన్న అంచనాలు బలంగా కనిపిస్తున్నాయి. ఈ విజయ ంతో తేజ సజ్జా, టాలీవుడ్ లో ప్రభాస్, ఎన్టీఆర్‌ల తర్వాత వరుసగా రెండు సినిమాలతో %వి%3 మిలియన్ మార్క్ అందుకున్న మూడో హీరోగా ఘనత సాధించనున్నాడు. చిన్న హీరోగా పరిచయమైన తేజ సజ్జా ఇప్పుడు స్టార్ హీరోల సరసన నిలవడం గమనార్హం. మిరాయ్ సినిమాతో అతని క్రేజ్ మరో స్థాయికి చేరిందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా మిరాయ్ వసూళ్ల పరంగా శరవేగంగా దూసుకుపోతోంది. ఇప్పటి వరకు ఈ చిత్రం ?150 కోట్ల దిశగా వసూళ్లు సాధించడం, పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ పొందడం విశేషం. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మంచు మనోజ్, ఋతికా నాయక్, శ్రియా శరన్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్, థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లే, ఎమోషనల్ కంటెంట్ సినిమాకు హైలైట్‌గా నిలిచాయి. ఈ విజయంతో తేజ సజ్జా తదుపరి సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఓ చిన్న హీరోగా ప్రారంభమై, పాన్ ఇండియా విజయం సాధించడం తేజ సత్తా ఏంటో తెలియజేస్తుంది. రానున్న రోజులలో 'మిరాయ్' ఇంకా ఎన్ని రికార్డులు నమోదు చేస్తుందో చూడాల్సిందే.



## కలలోనూ ఊహించలేదు..: రుక్మిణీ

రుక్మిణీ వసంత్.. నిన్న మొన్నటి వరకు కన్నడ సినీ ఇండస్ట్రీలో ఈ పేరుఫుల్ గా వినిపించింది. అక్కడ తీసిన సప్త సాగరాలు దాటి సిరీస్ చిత్రాలతోపాటు బఘీర వంటి సినిమాలతో ఆమె మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. రీసెంట్ గా కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ లీడ్ రోల్ లో తెరకెక్కిన మదరాసితో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్మిణీ.. తన యాక్టింగ్‌తో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు అక్టోబర్ 2వ తేదీన కాంతార చాప్టర్ 1తో సందడి చేయనున్న అమ్మడు.. తాజాగా ఇచ్చిన ఓఇంటర్వ్యూలో పలు విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముందుగా కాంతార ప్రీక్వెల్ మూవీ ఛాన్స్ కోసం మాట్లాడారు. తాను నటించిన సప్తసాగరాలు దాటి, ఏస్ మూవీలను రిషబ్ శెట్టి చూశారని, ప్రీమియర్స్ కు వచ్చి తన నటనను మెచ్చుకున్నారని తెలిపారు. కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215